**నీలగిరి నిత్యపద్యం**
ఆటవెలది

విడువుమయ్య చెడును విడువకు
మంచిని
కష్టమైన గాని కలనయైన
సత్యభాషణమున, శాంతి స్వభావమున్
మెలుగుచుండ నీకు మేలుసుమ్ము

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 16 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | బుధవారం | 20-05-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## వణికిస్తున్న..ఎబోలా!



- ఆఫ్రికా దేశాలపై వైరస్ పడగ
- ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు
- ఇతర దేశాలకు పాకుతున్న వైరస్
- అప్రమత్తమైన భారత్..
- విదేశాల నుంచి వచ్చేవారికి ఇక స్క్రీనింగ్
- ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాల వద్ద నిఘా

2లో

## ఇంటర్నెట్‌కూ..టోల్ గేట్!



- అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు షాక్
- అండర్ సీ డేటా కేబుల్స్‌పై టోల్ టాక్స్
- ఇరాన్ అల్లామోర్దీన్ స్టార్టప్ ఐడియా
- టోల్ కట్టకపోతే మీ వైర్లు కట్ చేస్తాం
- ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ బంద్ అంటూ హెచ్చరికలు

2లో

# ప్రాజెక్ట్‌లపై.. రేవంత్ దృష్టి

పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు భూసేకరణకు ఆదేశం



- యుద్ధప్రాతిపదికన పాలమూరు భూసేకరణ పూర్తి చేయాలి
- నిధుల చెల్లింపుల్లో జాప్యం వద్దు.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- ఉమ్మడి మహబూబ్‌నగర్ మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి కీలక భేటీ
- ప్రాజెక్టుల పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధం
- సాగునీటి పథకాల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిందే
- సాగునీటి పథకాలపై దిశానిర్దేశం

**హైదరాబాద్, మే 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ ప్రక్రియను దగ్గరుండి యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయించాలని మంత్రులను, ఎమ్మెల్యేలను సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మర్రి చెన్నారెడ్డి మానవవనరుల కేంద్ర కార్యాలయంలో మంగళవారం నాడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి భేటీ అయ్యారు. ఉమ్మడి పాలమూరు జిల్లా సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించి పలు కీలక సూచనలు చేశారు. జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి వీలైనంత త్వరగా భూసేకరణ పూర్తి చేయాలని చెప్పారు. భూసేకరణ నిధుల విషయంలో జాప్యం జరగకుండా వెంటనే చెల్లింపులు జరిగేలా చూస్తామని -మిగతా 2 లో



### పండుగ వాతావరణంలో
## ఆవిర్భావ వేడుకలు

- తెలంగాణ ఆవిర్భావ వేడుకలపై ప్రభుత్వం స్పెషల్ ఫోకస్
- రాష్ట్ర ఆవిర్భావ వేడుకలపై ఉన్నత స్థాయి సమీక్ష
- అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచన
- పరేడ్ గ్రౌండ్స్‌లో రిహార్సల్స్ చేయాలని అధికారులకు ఆదేశం
- ప్రత్యేకంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం

**హైదరాబాద్, మే 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి సర్కార్ నిర్ణయించింది. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రధాన వేడుకలు జరగనున్నాయి. ముందుగా గన్‌పార్క్‌లో అమరవీరులకు నివాళులు అర్పించనున్నారు సీఎం రేవంత్ రెడ్డి. మంగళవారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల ఏర్పాట్లపై సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉన్నతాధికారులకు తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ పలు కీలక అంశాలపై దిశానిర్దేశం చేశారు. అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని వికాస్ రాజ్ సూచించారు. ప్రతి శాఖ నుంచి నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు. పరేడ్ గ్రౌండ్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేయాలని మార్గనిర్దేశం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వాహనాల పార్కింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని నిర్దేశించారు.

-మిగతా 2 లో



### నేడు మెడికల్
## షాపులు బంద్!

- 2.4 లక్షలకు పైగా మెడికల్ దుకాణాలు బంద్
- కార్పొరేట్ కంపెనీలు ఆన్‌లైన్‌లో డిస్కౌంట్లు ఇవ్వడంపై ఆందోళన
- ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించడం లేదని ఆందోళన

**న్యూఢిల్లీ,** దేశవ్యాప్తంగా ఈ నెల 20వ తేదీన (నేడు) 12.4 లక్షలకు పైగా మెడికల్ షాపులు మూతపడనున్నాయి. ఆలిండియా ఆర్గనైజేషన్ ఆఫ్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ (ఏఐఓసీడీ) దేశవ్యాప్త బంద్ కు పిలుపునిచ్చింది. కార్పొరేట్ కంపెనీల అండదండలతో నడుస్తున్న ఆన్‌లైన్ ఫార్మసీలు భారీ డిస్కౌంట్లు ఇస్తూ సాంప్రదాయ మెడికల్ షాపులకు నష్టం కలిగిస్తున్నాయంటూ కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిన్న ఫార్మసీ కంపెనీలు ఈ పోటీని తట్టుకోలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని వారు చెబుతున్నారు. అనియంత్రిత ఆన్‌లైన్ అమ్మకాలు, ఈ-ఫార్మసీ డిస్కౌంట్లకు వ్యతిరేకంగా ఏఐఓసీడీ బంద్ కు

-మిగతా 2 లో



### నిప్పుల కొలిమిలా భారత్..
## అల్లాడుతున్న జనం!


- దేశవ్యాప్తంగా రికార్డు స్థాయికి ఉష్ణోగ్రతలు..
- 48 డిగ్రీలకు చేరిన భానుడి భగభగలు
- ఢిల్లీ, మహారాష్ట్రల్లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు
- రాబోయే రోజుల్లో మరింత తీవ్రంగా వడగాల్పులు: ఐఎండీ హెచ్చరిక

**న్యూఢిల్లీ,** దేశం ఎండ వేడిమితో అట్టుడుకుతోంది. అనేక ప్రాంతాల్లో గతంలో ఎప్పుడూ లేని ఎండలు నమోదవుతున్నాయి. అనేక ప్రాంతాల్లో గరిష్టంగా 48 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది అత్యంత ప్రమాదకర స్థాయి. దేశ రాజధాని ఢిల్లీతోపాటు మహారాష్ట్రలోని విదర్భలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ప్రజలు ఈ ఎండ వేడిమికి తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.రాబోయే రోజుల్లో ఎండలు మరింత పెరిగి, వడగాల్పులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.

-మిగతా 2 లో

## భారత్‌లో తీవ్ర ఆర్థిక తుపాను

- శ్రామిక వర్గాన్ని నష్టపరిచేలా వ్యవహరిస్తున్న ప్రభుత్వం
- బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చేలా ఆర్థిక వ్యవస్థ రూపకల్పన
- లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



**న్యూఢిల్లీ:** భారత్‌లో ఎవరూ అడ్డుకోలేనటువంటి తీవ్రమైన ఆర్థిక తుపాను రాబోతుందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ హెచ్చరించారు. ప్రధాని మోడీ ఆర్థిక విధానాలు విఫలమవుతున్నాయని, ఆ తర్వాత వాటిల్లే భారీ నష్టాన్ని సామాన్యుడే ఎదుర్కోవాల్సి వస్తుందని పేర్కొన్నారు. రాయ్‌బరేలీలో ఓ సభలో పాల్గొన్న రాహుల్, కేంద్ర ప్రభుత్వ ఆర్థిక విధానాలను తప్పుబట్టారు. శ్రామిక వర్గాన్ని నష్టపరిచి, బిలియనీర్లకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఆర్థిక వ్యవస్థను రూపొందించారని దుయ్యబట్టారు. పౌరులను విదేశీ ప్రయాణాలను తగ్గించుకోమని కోరుతున్న ప్రధాని, తాను మాత్రం తరచూ విదేశాలకు వెళ్తున్నారని విమర్శించారు. సమస్య పెట్రోల్, విద్యుత్ వాహనాలతో కాదని, అది ద్రవ్యోల్బణంతో -మిగతా 2 లో

## నిరుద్యోగులకు శుభవార్త

- గరిష్ట వయోపరిమితి 44 ఏండ్లకు పెంపు
- మరో ఏడాది పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ

**హైదరాబాద్** రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో గరిష్ఠ వయోపరిమితిని ప్రభుత్వం మరో ఏడాది పొడిగించింది. గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులు ఏడాది పాటు అమల్లో ఉంటాయని జీవోలో పేర్కొంది. పోలీసు తదితర యూనిఫామ్ సర్వీస్ లకు సడలింపు వర్తించదని ప్రభుత్వం స్పష్టం చేసింది. -మిగతా 2 లో



### ఇకపై వాట్సాప్‌లో
## ప్రభుత్వ సేవలు

- కొత్తగా తొమ్మిది పౌర సేవలు అందుబాటులోకి
- డిజిటల్ సేవలను మరింత విస్తరించిన ప్రజా ప్రభుత్వం
- ఇకపై వాట్సాప్ మీసేవలో మరిన్ని జీహెచ్‌ఎంసీ సేవలు
- ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**హైదరాబాద్, మే 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఇకపై వాట్సాప్ లో ప్రభుత్వ సేవలు అందనున్నాయి. జీహెచ్‌ఎంసీకి సంబంధించిన పౌర సేవలను కొత్తగా మీసేవ వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా తెలంగాణ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ప్రజలకు మరింత సౌకర్యం, అందుబాటు, పారదర్శకత కల్పించే దిశగా ఈ సేవలను విస్తరించారు. ఈ మేరకు ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం ఒక ప్రకటన విడుదల చేసింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల

-మిగతా 2 లో

### పాలమూరు ప్రాజెక్టులు పూర్తి
## చేయడమే ప్రభుత్వ లక్ష్యం

- జూరాలలో పూడికతీసి నీళ్ళు నిల్వ చేస్తాం
- కేసీఆర్ హయాంలో ఆప్రాజెక్టుకు భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారు
- గత ప్రభుత్వం పాలమూరుకు చేసిన అన్యాయాన్ని ప్రజలకు వివరిస్తాం
- మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి ఆగ్రహం



**హైదరాబాద్, మే 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పాలమూరు ప్రాజెక్టులను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. దేవాదుల, ఎస్ఎల్బీసీ, సీతారామ ప్రాజెక్టులతో సమాన ప్రాధాన్యం ఇస్తామని వ్యాఖ్యానించారు. కేసీఆర్ హయాంలో పాలమూరు – రంగారెడ్డి పనులు 90శాతం పూర్తి అయ్యాయన్నది అసత్యమని అన్నారు. బీఆర్ఎస్ నేతలు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. భూసేకరణ లేకుండానే టెండర్లు పిలిచారని విమర్శించారు. మంగళవారం సచివాలయంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సమీక్ష సమావేశం నిర్వహించారు. -మిగతా 2 లో

# వీధికుక్కలను తరలించాల్సిందే

ప్రజల ప్రాణాలతో చెలగాటం వద్దు

- ప్రతి జిల్లాలో పూర్తిస్తాయిలో బర్త్ కంట్రోల్
- అవసరమైతే ప్రమాదకరమైన కుక్కలకు కారుణ్య మరణం
- స్కూళ్లు, కాలేజీలు, బస్టాండ్లలో కుక్కలను లేకుండా చేయాలి
- అమలు చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వాలపై కఠిన చర్యలు:
- గతంలో ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనన్న సుప్రీం



**న్యూఢిల్లీ, మే 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వీధికుక్కల బెడదను రూపుమాపాల్సిందేనని సుప్రీం మరోమారు స్పష్టం చేసింది. ఈ విషయంలో రాజీలేదని తెలిపింది. ఇది ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశగా పేర్కొంది. బహిరంగ ప్రదేశాల్లో వీధి కుక్కలను తొలగించాలంటూ గతంలో జారీ చేసిన ఆదేశాలను ఉపసంహరించాలంటూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. గతంలో జారీ చేసిన ఆ ఉత్తర్వులను సవరించాలని చేసిన విజ్ఞప్తిని కూడా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్కూల్, కాలేజీ, రైల్వే స్టేషన్, బస్టాండ్ తదితర బహిరంగ ప్రదేశాల్లో కుక్కలను తొలగించాలంటూ జంతు ప్రేమికులు దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు మంగళవారం విచారించింది. -మిగతా 2 లో

## పండుగ వాతావరణంలో
# ఆవిర్భావ వేడుకలు

మొదటి తరువాయి



వాటర్ ప్రూఫ్ షామియానాలు, బారికేడింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. సభా ప్రాంగణంలో తాగునీరు, పారిశుధ్య ఏర్పాట్లు చేయాలని అన్నారు. పండుగ వాతావరణంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించాలని సూచించారు. అసెంబ్లీ, సచివాలయం, చార్మినార్ విద్యుత్ దీపాలతో అలంకరించాలని నిర్దేశించారు. రాష్ట్ర వేడుకలకు లైవ్ టెలికాస్ట్ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మే 25వ తేదీ నుంచి పరేడ్ గ్రౌండ్‌లో సంయుక్త రిహార్సల్స్ నిర్వహించాలని వికాస్ రాజ్ మార్గనిర్దేశం చేశారు.

# ప్రాజెక్ట్‌లపై.. రేవంత్ దృష్టి

మొదటి తరువాయి

ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు సిద్ధం

జిల్లాలోని ఇతర ప్రాజెక్టులకు సంబంధించి పెండింగ్ బిల్లులను చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై జిల్లా మంత్రులు సంబంధిత జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించి ప్రాజెక్టుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. ఈ భేటీలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ప్రభుత్వ విప్ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, మధుసూదన్ రెడ్డి, మేఘా రెడ్డి, రాకేష్ రెడ్డి, వంశీకృష్ణ, వీర్లపల్లి శంకరయ్య, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

## నేడు మెడికల్
# షాపులు బంద్!

మొదటి తరువాయి

పిలుపునిచ్చింది. ఈ బంద్ కారణంగా సాధారణ మందుల కొనుగోలు ఒకరోజు పాటు తీవ్రంగా ప్రభావితం కానుంది. ఆసుపత్రులకు అనుగుణంగా ఉన్న ఎమర్జెన్సీ ఫార్మసీలు మాత్రం తెరిచి ఉండే అవకాశం ఉంది. 20న బంద్ నేపథ్యంలో అత్యవసర మందులను ముందుగానే కొనుగోలు చేయాలని ఏఐఓసీడీ సూచించింది. ఈ బంద్‌లో కెమిస్టులు, ఫార్మాస్యూటికల్ డిస్ట్రిబ్యూటర్లు పాల్గొననున్నారు. ఆన్‌లైన్ ఫార్మసీని నియంత్రించాలని ఏఐఓసీడీ డిమాండ్ చేస్తోంది. ఆన్‌లైన్ కంపెనీలు తక్కువ ధరలకు మందులు విక్రయించడం వల్ల స్థానిక వ్యాపారులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. డాక్టర్ ప్రిస్క్రిప్షన్లు దుర్వినియోగం అవడమే కాకుండా, ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా విక్రయిస్తున్నారని పేర్కొంది. కార్పొరేట్ సెక్టార్లు ఇస్తున్న డిస్కౌంట్లను నియంత్రించాలని, ధరల నియంత్రణ విషయంలో నిబంధనలు పాటించకుండా నేషనల్ ప్రైస్ అథారిటీ ప్రకారం విక్రయాలు జరగాలని డిమాండ్ చేసింది. కొవిడ్ సమయంలో పేషెంట్లకు మందులు డోర్ డెలివరీ చేశారని, ఈ సౌకర్యాన్ని నిలిపివేయాలని కోరింది. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు వెళ్ళినప్పటికీ, సరైన చర్యలు తీసుకోలేదని ఏఐఓసీడీ పేర్కొంది. అత్యవసర వైద్య సేవలకు అంతరాయం కలిగించకుండా, బంద్‌లో శాంతియుతంగా, చట్టబద్ధంగా పాల్గొనాలని డ్రగ్స్ కంట్రోల్ ఆఫీసర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు జి.కోటేశ్వరరావు అన్నారు. ప్రజాప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని, నిజమైన అత్యవసర పరిస్థితులలో మాత్రమే ఎమర్జెన్సీ మందులను సరఫరా చేయాలని అన్నారు. రోగులు, ప్రజలు, అధికారులు లేదా ఏజెన్సీలతో ఎటువంటి ఘర్షణకు దిగవద్దని కోరారు. అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని కోరారు. బంద్ సమయంలో బలవంతపు మూసివేతలు, బెదిరింపులు, చట్టవిరుద్ధ కార్యకలాపాలను నివారించాలని పోలీసు శాఖను కోరారు. అంబులెన్సులు, అత్యవసర మందుల సరఫరా వాహనాలు, ఆరోగ్య సిబ్బంది సులభంగా రాకపోకలు సాగించేలా చూడాలని కోరారు.

## నిప్పుల కొలిమిలా భారత్..
# అల్లాడుతున్న జనం!

మొదటి తరువాయి

ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించింది. మహారాష్ట్రలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. విదర్భ, అమరావతి పట్టణాల్లో 46.8 డిగ్రీలు, వార్ధాలో 46.5 డిగ్రీలు, అకోలాలో 46 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఇతర పట్టణాల్లో కూడా ఇదే స్థాయిలో టెంపరేచర్ పెరుగుతోంది. మహారాష్ట్ర, ఢిల్లీలాంటి చోట్ల ఇప్పుడప్పుడే ఎండలు తగ్గే అవకాశం లేదని ఐఎండీ హెచ్చరించింది. అనేక ప్రాంతాల్లో 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు చేరే అవకాశం ఉందని తెలిపింది. ఈ ప్రాంతంలో ఐఎండీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఢిల్లీలో ఉష్ణోగ్రతలతోపాటు వాయు కాలుష్యం కూడా కలవరపెడుతోంది. ఈ వారం అంతా నార్త్ ఇండియా, సెంట్రల్ ఇండియా, వెస్టర్న్ ఇండియాలలో ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. భారీ ఎండల నేపథ్యంలో ఐఎండీ.. ప్రజలకు కీలక సూచనలు జారీ చేసింది. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని, ఎండ ప్రభావానికి గురి కాకుండా చూసుకోవాలని, ఇండ్లలోనే ఉంటూ తగినన్ని నీళ్లు తాగాలి, ముఖ్యంగా పగటి పూట బయటకు వెళ్లొద్దని సూచించింది.

# నిరుద్యోగులకు శుభవార్త

మొదటి తరువాయి




తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత గరిష్ట వయోపరిమితిని పదేండ్ల పాటు సడలించారు. ఆ తర్వాత మరో రెండేండ్లు పొడిగించారు. ఆ గడువు కూడా ముగియడంతో నిరుద్యోగుల అభ్యర్థన మేరకు ప్రభుత్వం మరో ఏడాది పొడిగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

# వణికిస్తున్న.. ఎబోలా!

**-ఆఫ్రికా దేశాలపై వైరస్ పడగ**
**-ఇప్పటికే వందల సంఖ్యలో మరణాలు**
**-ఇతర దేశాలకు పాకుతున్న వైరస్**
**-అప్రమత్తమైన భారత్..**
**-విదేశాల నుంచి వచ్చేవారికి ఇక స్క్రీనింగ్**
**-ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాల వద్ద నిఘా**



**న్యూఢిల్లీ,**
ఆఫ్రికా నుంచి వచ్చే ప్రయాణికుల ద్వారా ఈ వైరస్ వ్యాపించే అవకాశం ఉన్నందున, ప్రధాన విమానాశ్రయాలు, నౌకాశ్రయాల వద్ద స్క్రీనింగ్ ప్రక్రియను ముమ్మరం చేశారు. లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వెంటనే క్వారంటైన్‌కు తరలించేలా ప్రత్యేక వార్డులను ఏర్పాటు చేస్తున్నారు. ముఖ్యంగా కాంగో, ఉగాండా దేశాల నుంచి వచ్చే వారి ప్రయాణ వివరాలను నిశితంగా పరిశీలిస్తున్నారు. నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్, ఐసీఎంఆర్ వంటి సంస్థలు ఎప్పటికప్పుడు మారుతున్న పరిస్థితులను పర్యవేక్షిస్తున్నాయి. ఆఫ్రికా దేశాల్లో మళ్లీ ఎబోలా వైరస్ పడగ విప్పడంతో భారత ప్రభుత్వం ఒక్కసారిగా అప్రమత్తమైంది. కాంగో, ఉగాండా దేశాల్లో ఈ వైరస్ కేసులు విపరీతంగా పెరుగుతుండటంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ ఇప్పటికే పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీని ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతానికి మన దేశంలో ఒక్క ఎబోలా కేసు కూడా నమోదు కాలేదని, ముప్పు చాలా తక్కువగా ఉందని స్పష్టం చేస్తూనే.. ముందుజాగ్రత్తగా నిఘా పెంచాలని అన్ని రాష్ట్రాలను ఆదేశించింది.


**పుణే ఎన్ఐవీ ల్యాబ్ సిద్ధం**
ఎలిబోలా నిర్ధారణ పరీక్షల కోసం పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీని నోడల్ ల్యాబ్‌గా ప్రభుత్వం ప్రకటించింది. ఏదైనా అనుమానిత కేసు వస్తే శాంపిల్స్‌ను వెంటనే ఇక్కడికి పంపి పరీక్షలు చేయనున్నారు. అవసరమైతే మరిన్ని ల్యాబ్‌లను కూడా ఈ నెట్‌వర్క్‌లోకి తీసుకువచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎబోలా వైరస్ నియంత్రణకు అవసరమైన అన్ని రకాల ఆరోగ్య మౌలిక సదుపాయాలు సిద్ధంగా ఉన్నాయని ఆరోగ్య మంత్రిత్వ శాఖ భరోసా ఇచ్చింది.

**వంద మందికి పైగా మృతి**
ఆలిఫ్రికాలో ఈ తాజా బుండిబుగ్యో స్ట్రెయిన్ ఎబోలా కారణంగా ఇప్పటికే వందలాది మంది మరణించినట్లు నివేదికలు అందుతున్నాయి. మరోవైపు, మే 28 నుంచి 31 వరకు ఢిల్లీలో ఇండియా-ఆఫ్రికా ఫోరమ్ సమ్మిట్ జరగనుంది. దీనికి కాంగో, ఉగాండాతో సహా పలు ఆఫ్రికా దేశాల ప్రతినిధులు హాజరయ్యే అవకాశం ఉంది. అలాగే జూన్ 1న ఇంటర్నేషనల్ బిగ్ క్యాట్ అలయన్స్ సదస్సు కూడా ఉంది. ఈ కీలక సమావేశాల నేపథ్యంలో విదేశీ ప్రతినిధుల ఆరోగ్య పరీక్షల విషయంలో కేంద్రం మరింత పకడ్బందీగా వ్యవహరిస్తోంది.

# ఇంటర్నెట్‌కూ..టోల్ గేట్!

**-అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు షాక్**
**-అండర్ సీ డేటా కేబుల్స్‌పై టోల్ టాక్స్**
**-ఇరాన్ అల్లామొద్దీన్ స్టార్టప్ ఐడియా**
**-టోల్ కట్టకపోతే మీ వైర్లు కట్ చేస్తాం**
**-ప్రపంచ వ్యాప్తంగా ఇంటర్నెట్ బంద్ అంటూ హెచ్చరికలు**

**న్యూఢిల్లీ,**
పశ్చిమాసియా యుద్ధ మేఘాలు ఇప్పటికే ప్రపంచాన్ని వణికిస్తుంటే ఇప్పుడు ఇరాన్ మరో అల్లామొద్దీన్ స్టార్టప్ ఐడియాతో అంతర్జాతీయ టెక్ దిగ్గజాలకు ప్యాంట్ తడిచేలా చేస్తోంది. ప్రపంచ సరఫరా దారుల్లో అత్యంత కీలకమైన 'హార్ముజ్ జలసంధి' గుండా వెళ్ళే చమురు ట్యాంకర్లకు టోల్ ట్యాక్స్‌లు వేయడం.. బెదిరించడం పాత చింతకాయ పచ్చడి కథ అయిపోయిందని ఇరాన్ భావించినట్టుంది. అందుకే రూటు మార్చి ఈసారి నేరుగా ప్రపంచానికి ఊపిరిగా మారిన 'ఇంటర్నెట్'కే టోల్ గేట్ వేయాలన్న సరికొత్త మాస్టర్ ప్లాన్‌తో బైహాన్ రంగంలోకి దిగింది.



గ్లోబల్ ఐటీ కారిడార్లలో భూకంపం

సముద్ర గర్భంలో మైళ్ళ కొద్దీ పరుచుకున్న అండర్‌సీ డేటా కేబుల్స్ పై ఫీజులు వసూలు చేయాలని ఇరాన్ గట్టిగా ఆలోచిస్తోందన్న వార్తలు ఇప్పుడు గ్లోబల్ ఐటీ కారిడార్లలో భూకంపం సృష్టిస్తున్నాయి. ప్రపంచమంతా సోఫాలో పడుకుని "ఇన్‌స్టాగ్రామ్ రీల్స్" చూస్తూ "ట్విట్టర్ మీమ్స్" షేర్ చేస్తూ టైమ్ పాస్ చేస్తుంటే.. ఆ డేటా అంతా ప్రవహించే అసలు సిసలైన వైర్లు తమ సముద్రం కింద నుంచే వెళ్తున్నాయని ఇరాన్ ఆలస్యంగా గుర్తించింది. అంతే.. వెంటనే గల్లా పెట్టె తెరిచి "అన్నా... వైర్లు మావయ్యా.. కాస్త టోల్ కట్టి వెళ్ళండయ్యా!" అంటూ సరికొత్త డిమాండ్లను తెరపైకి తెచ్చింది.

**సాంకేతిక లోపాలంటూ హెచ్చరికలు**
టెక్ దిగ్గజాలకు 'ఇరాన్' మార్క్ మెసేజీలు విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. సిలికాన్ వ్యాలీ సామ్రాజ్యాలైన గూగుల్, మైక్రోసాఫ్ట్, మెటా, అమెజాన్ వంటి టెక్ జెయింట్స్‌కు ఇరాన్ నుంచి ప్రత్యేకంగా 'అంబాసిడర్ లెటర్స్' వెళ్ళాయట. ఆ లెటర్స్ సారాంశం సింపుల్‌గా.. కానీ స్ట్రాంగ్‌గా ఉంటుందంటున్నారు. "మీరు గనుక సకాలంలో ఈ డేటా టోల్ ఫీజులు చెల్లించకపోతే.. అంతర్జాతీయ డేటా ట్రాఫిక్‌లో చిన్న చిన్న 'సాంకేతిక లోపాలు' అదేనండీ.. కేబుల్ కట్స్, సిగ్నల్ బ్లాక్స్ రావచ్చు. ఆ తర్వాత మీ ఇష్టం" అని ఇరాన్ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసినట్లు ప్రచారం జరుగుతోంది.

## ఇకపై వాట్సాప్‌లో
# ప్రభుత్వ సేవలు

మొదటి తరువాయి

శ్రీధర్‌బాబు నాయకత్వంలో మీసేవ ద్వారా పౌర సేవలను మరింతగా తీర్చిదిద్దుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వ డిజిటల్ సేవల ప్రధాన వేదికగా ఉన్న మీసేవను వాట్సాప్, చాట్‌బాట్ ద్వారా మరింత విస్తరించారు. ఈ అదనపు డిజిటల్ ఛానల్స్‌ను 2025 నవంబర్ 18న ప్రారంభించారు. కొత్తగా జీహెచ్‌ఎంసీ ప్రాపర్టీ అసెస్‌మెంట్ రివిజన్, జనన ధ్రువీకరణ సవరణ, మరణ ధ్రువీకరణ సవరణ, బర్త్ హోమ్(ఇంటి దగ్గర పుట్టిన), డెత్ హోమ్(ఇంటి దగ్గర చనిపోయిన), ప్రాపర్టీ డోర్ నంబర్ సవరణ, ప్రాపర్టీ పేరు సవరణ, ప్రాపర్టీ ట్యాక్స్ సేవల, ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ సేవలను వాట్సాప్ మీసేవలో చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా పౌరులు ఈ సేవలను వాట్సాప్ ద్వారానే పొందవచ్చని ఎలక్ట్రానిక్ సర్వీస్ డెలివరీ విభాగం తెలిపింది. సేవలు పొందేందుకు ముందుగా 8096958096 నంబర్‌ను మొబైల్‌లో 'మీసేవ తెలంగాణ' పేరుతో సేవ్ చేసుకోవాలి. అనంతరం వాట్సాప్‌లో ఆ నంబర్‌కు 'హాయ్' సందేశం పంపాలి. అవసరమైన సేవ పేరు టైప్ చేసి, మెనూలో కనిపించే ఆప్షన్‌పై క్లిక్ చేయాలి. ఫారంలో అడిగిన వివరాలు, చెల్లింపు పూర్తిచేస్తే దరఖాస్తు వెంటనే వాట్సాప్ ద్వారా నమోదవుతుంది. వాట్సాప్ ఆధారిత మీసేవ వేదికకు ప్రారంభం నుంచి ప్రజల నుంచి మంచి స్పందన లభించిందని ప్రభుత్వం వెల్లడించింది. జనన ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, పోలీస్ చలాన్, విద్యుత్ బిల్లు, బీఈడీ ఫలితాల సేవలను ప్రజలు ఎక్కువగా వినియోగిస్తున్నట్లు తెలిపింది. రోజువారీ పరిపాలన సేవలకు వాట్సాప్‌పై ప్రజల ఆధారపడటం పెరుగుతోందని పేర్కొంది. డిజిటల్ సేవలను నిరంతరం విస్తరించడం, ప్రభుత్వ వ్యవస్థల విశ్వసనీయతను బలోపేతం చేయడం, పౌరులకు సులభమైన అనుభవం కల్పించడం తమ లక్ష్యమని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది.

## వీధికుక్కలను
# తరలించాల్సిందే

మొదటి తరువాయి

ఈ సందర్భంగా జంతు సంక్షేమ బోర్డు దాఖలు చేసిన అన్ని పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ సందర్భంగా తన తీర్పులో.. పలు కీలక అంశాలను సుప్రీంకోర్టు ప్రస్తావించింది. వీధి కుక్కల సమస్యను జంతు సంక్షేమ అంశంగా కాకుండా ప్రజల ప్రాణాల భద్రతకు సంబంధించిన అంశంగా పరిగణించాలని పిటిషనర్లకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా రూపొందించిన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయడం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. ప్రతి జిల్లాలో కనీసం ఒక పూర్తి స్థాయి యానిమల్ బర్త్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. జనాభాను దృష్టిలో ఉంచుకొని అవసరమైతే జిల్లాలో ఈ కేంద్రాల సంఖ్యను పెంచాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించింది. యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలు కచ్చితంగా అమలు అయ్యేలా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ప్రజల భద్రత దృష్టిలో ఉంచుకుని స్కూళ్లు, కాలేజీలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్లతోపాటు ఇతర ప్రదేశాల్లో కూడా ప్రత్యేక చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. దేశవ్యాప్తంగా యాంటీ రేబిస్ మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సూచించింది. రహదారులపై సంచరించే పశువుల సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియాకు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. జాతీయ రహదారులపై తిరిగే జంతువుల సమస్యల పర్యవేక్షణ కోసం ప్రత్యేక మానిటరింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఎన్‌హెచ్‌ఏఐను కోరింది. రేబిస్ బారిన పడిన లేదా మానవుల ప్రాణాలకు ముప్పుగా పరిణమించే ప్రమాదకర కుక్కల విషయంలో చట్టబద్ధంగా అనుమతించిన చర్యలు తీసుకోవచ్చని సుప్రీంకోర్టు ఈ సందర్భంగా స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల అమలు కోసం విధులు నిర్వహించే ఉద్యోగులకు తగిన రక్షణ కల్పించాలని ప్రభుత్వాలకు సూచించింది. విధులు నిర్వర్తించే క్రమంలో వారిపై బలవంతపు చర్యలు తీసుకోవద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది.

# భారత్‌లో తీవ్ర ఆర్థిక తుపాను

మొదటి తరువాయి

అని ప్రధాని అర్థం చేసుకోవాలని సూచించారు. వెంటనే చర్యలు తీసుకుని దేశాన్ని రక్షించాలని కోరారు. 'భారీ ఆర్థిక తుపాన్ రాబోతోంది. దీన్ని ఎవరూ అడ్డుకోలేరు. అంత తీవ్రమైన ఆర్థిక తుపాన్ రాబోతోంది. అది ఎంతపెద్దది అంటే మీరు, నేను మన జీవితంలో ఎప్పుడూ చూడలేనంత పెద్దది. దెబ్బ ఎవరికి తగులుతుంది? అంబానీ, అదానీలకు తగలదు. వాళ్లు తమ ప్యాలెస్‌లో కూర్చుని ఉంటారు. వాళ్ల ప్యాలెస్ చుట్టూ భద్రత ఉంటుంది. భారత రైతుకు, కార్మికుడికి, యువతకు, చిన్న వ్యాపారస్థులకు, చిన్న పరిశ్రమలకు దెబ్బతగులుతుంది. ఏవైతే ఉపాధిని కల్పిస్తాయో, వాటికి నష్టం కలగనుంది. ఇప్పుడు మేము చెప్తున్నాం నెలల ముందు నుంచే నేను చెప్తున్నాను. ఆర్థిక తుపాన్ వస్తోంది, సిద్ధం కావాలి అని. ప్రజలకు భారీ దెబ్బ తగలబోతోంది. పెట్రోల్ ధరలు పెరగబోతున్నాయని, ద్రవ్యోల్బణం ఆకాశాన్ని తాకబోతోందని చెబుతున్నాను. వాళ్లేమో (బీజేపీ) రాహుల్ గాంధీకి ఏం అవగాహన లేదని అంటున్నారు. ఇరాన్- అమెరికా మధ్య యుద్ధం చెలరేగడంతో మన ఇంధన సరఫరాను ఇరాన్ నిలిపివేసింది. ఫలితంగా దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. పెట్రోల్, డీజిల్‌ను పొదుపుగా వాడుకోవాలని, ఎలక్ట్రిక్ వాహనాలకు మారాలని మోడీ ప్రజలకు సలహా ఇస్తున్నారు. కానీ, మరుసటి రోజే మోడీ స్వయంగా విదేశాలకు వెళ్తున్నారు--రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత ప్రస్తుత కేంద్ర ప్రభుత్వాన్ని మార్చకపోతే దేశం మనుగడ సాగించలేదని లోక్‌సభలో విపక్షనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజకీయ వాస్తవాలపై ప్రజలు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన లోపించడం వల్లే ఎంజీఎన్‌ఆర్‌ఈజీఏ వంటి గ్రామీణ సామాజిక భద్రతా కార్యక్రమాలు పూర్తిగా రద్దు అవుతున్నాయని, చిన్న రైతులు ఆర్థికంగా నాశనమవుతారని హెచ్చరించారు. మరోవైపు దేశ అగ్ర నాయకులు మాత్రం కార్పొరేట్ సామాజిక కార్యక్రమాలకు హాజరుకావడానికే దృష్టి సారిస్తున్నారని ఆరోపించారు.

## పాలమూరు ప్రాజెక్టులు పూర్తి
# చేయడమే ప్రభుత్వ లక్ష్యం

మొదటి తరువాయి



ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. పాలమూరుకు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతామని చెప్పుకొచ్చారు. జూరాల ప్రాజెక్టులో పూడిక తొలగించి నిల్వ సామర్థ్యం పెంచుతున్నట్లు తెలిపారు. డి ఆర్ ఐ పి కింద జూరాల అభివృద్ధికి ప్రతిపాదనలు చేశామని వివరించారు. వర్షాకాలానికి ముందే చెరువుల్లో పూడికతీత పనులు చేపడతామని స్పష్టం చేశారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. 12.30 లక్షల ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. 1226 గ్రామాలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. 15 రోజుల్లో మరోసారి ప్రగతి సమీక్ష నిర్వహిస్తామని చెప్పుకొచ్చారు. ఆయా ప్రాజెక్టుల పురోగతిపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని అధికారులను మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

# నేటి రాశి ఫలితాలు





**మేషరాశి**
ఆర్థిక ఒడిదుడుకులు అధికమవుతాయి. వ్యాపారాలు కొంత మందకోడిగా సాగుతాయి. ఉద్యోగాలలో సహోద్యోగుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి. కుటుంబ సభ్యుల ప్రవర్తన వలన మానసిక అశాంతి కలుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. ఆరోగ్య విషయాలలో కొంత శ్రద్ధ వహించాలి. పక్షులకు నీళ్లు పెడితే శుభకరం

**వృషభరాశి**
సమాజంలో పరిచయాలు విస్తృతమవుతాయి. స్థిరాస్తి వివాదాలకు సంబంధించి ప్రముఖుల నుంచి ముఖ్య సమాచారం సేకరిస్తారు. ఆకస్మిక ధనలాభ సూచనలు ఉన్నవి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో ఆశించిన మార్పులుంటాయి. పశు వులకు పశుగ్రాస పెడితే శుభకరం

**మిధునరాశి**
చేపట్టిన పనులలో శ్రమ పెరుగుతుంది. ఒక వ్యవహారంలో సన్నిహితుల నుంచి అందిన సమాచారం నిరాశ కలిగిస్తుంది. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. వృత్తి వ్యాపారాలలో వ్యయప్రయాసలు తప్పవు. ఉద్యోగాలు గందరగోళంగా ఉంటాయి. వృద్ధులకు అన్నదానం శు భకరం

**కర్కాటకరాశి**
ఆస్తి వివాదాలు పరిష్కార దిశగా సాగుతాయి. మంచి మాట తీరుతో అందరినీ ఆకట్టుకుంటారు. ఇతరులకు సహాయ సహకారాలు అందిస్తారు. చేపట్టిన పనులు సజావుగా సాగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అంచనాలు నిజం అవుతాయి. తల్లిదండ్రులు సేవ శుభకరం

**సింహరాశి**
వృత్తి వ్యాపారాలలో స్వంత ఆలోచనలు కలసివస్తాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. దీర్ఘకాలిక సమస్యల నుంచి బయటపడతారు. స్థిరాస్తి క్రయవిక్రయాలలో లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో కీలక నిర్ణయాలు అమలు చేస్తారు. అనాధలకు అన్నదానం శుభకరం

**కన్య రాశి**
ప్రయాణాలలో శ్రమ మరింత అధికమవుతుంది. విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. వ్యాపార లావాదేవీలు నిరాశ కలిగిస్తాయి. ఆప్తులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆదాయానికి మించి ఖర్చులుంటాయి. ఉద్యోగాలలో చికాకులు అధికమవుతాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృద్ధులకు దప్పిక తీరుస్తే శుభకరం

**తులరాశి**
ముఖ్యమైన వ్యవహారాలలో ఆటంకాలు తప్పవు. ధన పరంగా ఒడిదుడుకులు అధికమవుతాయి. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. కుటుంబ సభ్యులు ఒత్తిడులు పెంచుతారు. వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ఉద్యోగాల్లో అదనపు బాధ్యతలు వలన విశ్రాంతి ఉండదు. ఆడబిడ్డలకు తీపి పంపిణీ చేస్తే శుభకరం

**వృశ్చికరాశి**
దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. సమాజంలో ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. చిన్ననాటి మిత్రులను కలుసుకుని పాత జ్ఞాపకాలు పంచుకుంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగ యోగం ఉన్నది. వ్యాపార, ఉద్యోగాలు సంతృప్తికరంగా ఉంటాయి. నీటిలో అన్నం వదులుతే శుభకరం

**ధనస్సు రాశి**
కుటుంబ సభ్యుల నుండి కీలక సమాచారం అందుతుంది. ఆప్తుల నుంచి అవసరానికి ధనం లభిస్తుంది. చిన్ననాటి మిత్రుల ఆగమనం ఆనందం కలిగిస్తుంది. సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పొందుతారు. విలువైన వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. వ్యాపార ఉద్యోగాలలో సంతృప్తికర వాతావరణం ఉంటుంది. మర్రి చెట్టు,జమ్మి చెట్టు మొదట్లో పాలు పోస్తే శు భకరం

**మకరరాశి**
ఇంటా బయట పరిస్థితులు అనుకూలించవు. వ్యాపారాలలో పెట్టిన పెట్టుబడులకు తగిన లాభాలు అందక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ముఖ్యమైన పనులు వాయిదా వేయడం మంచిది. ఆర్థిక ఇబ్బందులు మరింత బాధిస్తాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. గ్రామ సింహాలకు తీపి పెడితే శు భకరం

**కుంభరాశి**
ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలను సందర్శించుకుంటారు. ఆర్థిక ఇబ్బందుల వలన నూతన ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో పని ఒత్తిడి అధికమవుతుంది. వృద్ధులకు అన్నదానం శుభకరం

**మీనరాశి**
పుణ్యక్షేత్ర సందర్శనం చేసుకుంటారు. నూతన వాహన యోగం ఉన్నది. వ్యాపారులకు నూతన పెట్టుబడులు అందుతాయి. నిరుద్యోగ యత్నాలు ఫలిస్తాయి. సంఘంలో సరైన గౌరవ మర్యాదలు పొందుతారు. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. ఉద్యోగాలలో సమస్యలను అధిగమిస్తారు. బాలింతలకు ఆకుకూరల పంపిణీ శు భకరం



**దక్క జంబులయ్య (స్వామి )**
**9491163914**
**నందికొట్కూరు నంద్యాల జిల్లా**

# పెంచిన పెట్రోల్ డీజిల్ రేట్లను వెంటనే తగ్గించాలి

## - సీపీఎం.

**నిడమానూరు మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
పేద ప్రజలపై భారాలు మోపే పెట్రోల్ డీజిల్ రేట్లను వెంటనే తగ్గించాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు మండల కార్యదర్శి కందుకూరి కోటేశ్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం నిడమనూరు మండల కేంద్రంలో పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పెంచిన డీజిల్ పెట్రోల్ ధరలకు నిరసనగా ఆటో లాగుతూ నిరసన తెలియజేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత అన్నింటి ధరలను విపరీతంగా పెంచి పేద ప్రజలపై భారతం అవుతుందని, ప్రజా వ్యతిరేక విధానాలను



అవలంబిస్తుందని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ వ్యక్తులకు అనుకూలమైనటువంటి నిర్ణయాలు చేస్తున్నారని అన్నారు.గ్యాస్ కొరత ప్రజలను వేధిస్తుంటే, అన్నీ ధర లను పెంచి, ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ శక్తులకు అప్పజెప్పి ప్రభుత్వం క్రమంగా పరిపాలనా బాధ్యతలను వదిలేసి, పార్టీని పెంచుకోవడంలోనే దృష్టి పెట్టిందని అన్నారు. పాలన చేతకాక దేశ ప్రజలకు పొదుపు సూక్తులు వల్లిస్తున్నారని అన్నారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించకపోతే దేశ ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కోమాండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, ఆకారపు నరేష్, మలికంటి చంద్రశేఖర్, వెంపటి మహేష్, కొంచెం శేఖర్, కోదండ చరణ్ రాజ్, వింజమూరి శివ, బొడ్డు లింగయ్య, గుప్త శ్రీనివాస్ రెడ్డి, నడ్డి నాగరాజు, వెంకటమ్మ, సాంబయ్య, మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పుచ్చల పల్లి సుందరయ్య వర్ధంతి

**నిడమనూరు,**
నిడమనూరు మండల కేంద్రంలో దక్షిణ భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, ఆదర్శ నాయకులు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులకు కొండేటి శ్రీను మండల కార్యదర్శి కందుకూరు కోటేష్ మాట్లాడుతూ ఆదర్శవంతమైన విలువలతో రాజకీయాలు చేయడం కమ్యూనిస్టులకే సాధ్యమని దీనికి సుందరయ్య జీవితమే ఆదర్శమని అన్నారు. భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ భూస్వామ్య పెత్తందారి విధానాలకు వ్యతిరేకంగా చిన్ననాటి నుండే పోరాటం చేసిన మహా నాయకుడిని



అన్నారు. తెలంగాణలో భూస్వామ్య జమీందారీ రజాకార్లకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటం సాగించడంలో కీలకపాత్ర వహించారని, వ్యవసాయ కార్మికులకు కూలీ పెరగాలని, భూమి పంచాలని సంఘం సంఘం పెట్టి కూలి భూమి పోరాటాలు చేశారని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు,కోమండ్ల గురువయ్య, నల్లబోతు సోమయ్య, మల్లికంటి చంద్రశేఖర్, ఆకారపు నరేష్, వెంపటి మహేష్, ఇంజమూరి శివ, కుంచెం శేఖర్, ముత్యాల కేశవులు, కోదండ చరణ్ రాజు, గుప్త శ్రీనివాస్ రెడ్డి,నడ్డి నాగరాజు, బొడ్డు లింగయ్య, వెంకటమ్మ సాంబయ్య మేరమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం



**మిర్యాలగూడ, మే 19(నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మిర్యాలగూడ మండలం జటావత్ తండాలో ధర్మరక్షకుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, “శివాజీ మహారాజ్ కేవలం ఒక వ్యక్తి కాదు, ఆయన అజేయమైన శక్తి, ఒక చరిత్ర, ధైర్యానికి ప్రతీక. పరాయి పాలనను ఎదిరించి హిందూ స్వరాజ్యాన్ని స్థాపించిన మహనీయుడు. శత్రువుల స్త్రీలను తల్లీ సమానంగా గౌరవించిన గొప్ప సంస్కృతి ఆయనది” అని అన్నారు.“ఎలాంటి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయని దృఢ సంకల్పం, ప్రజల సంక్షేమాన్ని కోరుకునే పరిపాలనా దక్షత ఆయన సొంతం. శివాజీ మహారాజ్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి” అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించిన యువత, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. “శివాజీ మహారాజ్ చూపిన ధైర్య సాహసాలు, దేశభక్తి మనందరికీ ఎల్లప్పుడూ తోడుగా ఉండాలి” అని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# చెరువుల పరిరక్షణకు పాటు పడండి



**మేడ్చల్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో చెరువుల సుందరీకరణ, పరిరక్షణకు సహకరించాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ మంగళవారం హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ను కలిశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “బోడుప్పల్‌లోని రా చెరువు, పీర్జాదీగూడలోని పెద్ద చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌లుగా తీర్చిదిద్దాలి. చెంగిచెర్ల చింతల చెరువును సుందరీకరించి కలుషిత జలాలు చెరువులో కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి” అని విజ్ఞప్తి చేశారు.చెరువుల పరిరక్షణలో ప్రజల సహకారం అత్యంత కీలకమని, ఈ కార్యక్రమం ద్వారా పర్యావరణ సమతుల్యతతో పాటు ప్రజలకు విశ్రాంతి వేదికలు కూడా లభిస్తాయని ఆయన పేర్కొన్నారు.హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, బీ బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు సాయిపేట శ్రీనివాస్ యాదవ్, తుంగతర్తి రవి, మాజీ కార్పొరేటర్ బొమ్మకు కళ్యాణ్, ఆర్టీఏ మెంబర్ జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వైసీపీ హయాంలోనే ఎస్సీలపై దౌర్జన్యాలు



**నందికొట్కూరు, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
నందికొట్కూరు పట్టణంలోని ఏబీఎం పాలెంలో వైసీపీ పాలనలో ఎస్సీలపై అధిక దౌర్జన్యాలు జరిగాయని మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరాం ప్రసాద్ రెడ్డి ఆరోపించారు.ఆయన మాట్లాడుతూ, “మాజీ ఎమ్మెల్సీ వద్ద డ్రైవర్‌గా పనిచేసిన దళిత యువకుడు వీధి సుబ్రహ్మణ్యం 2022లో హత్యకు గురయ్యాడు. మొదట ప్రమాదంగా చూపించినా, దర్యాప్తులో తీవ్రంగా కొట్టడం వల్లే మరణించాడని బయటపడింది. ఇది రాజకీయ అండతో అధికార దుర్వినియోగానికి స్పష్టమైన నిదర్శనం” అని అన్నారు.తరువాత మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి మాట్లాడుతూ, “కోవిడ్ సమయంలో పీపీఈ కిట్ల కొరతపై ఆందోళనలు వ్యక్తం చేసిన ప్రభుత్వ అనస్థీటిస్ట్ డాక్టర్ సుధాకర్ 2021లో సస్పెండ్ చేయబడి, అరెస్టు చేయబడి అవమానించబడ్డారు. ఆయన మరణం వైసీపీ పాలనలో ప్రశ్నించే గొంతుకల అణచివేతకు ప్రతీక” అని పేర్కొన్నారు.ఈ ఘటనలు కలిపి చూస్తే, ఎస్సీ వర్గాలపై నిరంతర బెదిరింపులు, దౌర్జన్యాలు, వ్యవస్థాగత అన్యాయాలు వైసీపీ హయాంలో స్పష్టంగా కనిపిస్తున్నాయని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, ధర్మారెడ్డి, పల్చని మహేశ్వర్ రెడ్డి, షకీల్ అహ్మద్, నిమ్మకాయల రాజు, మోహన్, బ్రహ్మయ్య ఆచారి, ప్రేమ్ (రగడ ప్రవీణ్), శ్రీకాంత్ గౌడ్, అబ్దుల్లా, ఎల్లయ్య ఆచారి, ఇతర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనగణన 2027 ప్రచార రథం ప్రారంభం




**మర్రిగూడ, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండల తహసిల్దార్ జక్కర్తి శ్రీనివాసులు మంగళవారం తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో "భారత జనగణన 2027" పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ ప్రచార రథం మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి, దేశంలోనే మొట్టమొదటిసారిగా పూర్తి డిజిటల్ పద్ధతిలో జరుగుతున్న ఈ చారిత్రాత్మక జనగణన ప్రక్రియపై ప్రజలకు చైతన్యం కల్పించనుంది. స్వాతంత్ర్యం తర్వాత తొలిసారిగా కులగణనతో కూడిన జనాభా లెక్కలు సేకరించబడుతున్నాయని అధికారులు తెలిపారు. మొదటి దశలో మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యుమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి గృహాల జాబితా నమోదు చేపడతారు. ప్రజలు సరైన వివరాలు అందించి సహకరించాలని సూచించారు. అదేవిధంగా, ప్రజలు స్వయంగా ప్రభుత్వ పోర్టల్ ద్వారా మొబైల్ లేదా కంప్యూటర్ సహాయంతో వివరాలను నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ సందర్భంగా తహసిల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ, "ప్రతి గ్రామం, ప్రతి ఇల్లు, ప్రతి వ్యక్తి వివరాలు ఖచ్చితంగా నమోదయ్యేలా ప్రచార రథం ద్వారా విస్తృత మైక్ ప్రచారం జరుగుతుంది. ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా ఎన్యుమరేటర్లు అడిగే 34 ప్రశ్నలకు సరైన సమాధానాలు ఇవ్వాలి. ఇది దేశ ప్రగతికి తోడ్పడుతుంది" అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో భాస్కరరావు, డిప్యూటీ తహసిల్దార్ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, బీఎల్వోలు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

# ఉపాధి కూలీలకు 30% అలవెన్స్ కలపాలి



**నందికొట్కూరు, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కొత్తపల్లి మండలంలోని ఎదురుపాడు గ్రామరాస్తాలో ఉపాధి హామీ పనులను పరిశీలించిన సి.పి.ఐ(ఎం.ఎల్) లిబరేషన్ పార్టీ జిల్లా కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ, "వేసవికాలంలో ఉపాధి కూలీలకు 30% అలవెన్స్ కలపాలి. రోజువారీ కూలీ రూ.600 ఇవ్వాలి. నెలకు కనీసం 25 పని దినాలు కల్పించాలి. వంద రోజులు పని దాటిన వారందరికీ గడ్డపార పనిముట్లు ఇవ్వాలి. పనిస్థలాల్లో మెడికల్ కిట్లు, మజ్జిగ సౌకర్యం ఏర్పాటు చేయాలి" అని డిమాండ్ చేశారు. అదేవిధంగా, "ప్రమాదాలు జరిగి మరణించిన వారికి రూ.30 లక్షలు, గాయపడిన వారికి రూ.5 లక్షలు ఇవ్వాలి. మూడు కిలోమీటర్లకు పైగా ప్రయాణించే కూలీలకు రవాణా చార్జీలు చెల్లించాలి. పెండింగ్ బిల్లులు తక్షణమే మంజూరు చేయాలి. లిఫ్ట్ ఇరిగేషన్ కింద రైతుల పొలాల కాలువల పూడికల తీత చేపట్టాలి. ఉపాధి శ్రామికులకు నెలకు రూ.10 వేల పెన్షన్ ఇవ్వాలి" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎర్రమళ్ళ ఏసన్న, దిబ్బన్న, శ్రీనివాసులు, రవి, వెంకటేశ్వర్లు, సుబ్బలక్ష్మమ్మ, స్వరూప, శ్రీలక్ష్మి, మార్తమ్మ, లక్ష్మీదేవి, పార్వతమ్మ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

# కోడిపందాలు ఆడిన 14 మంది అరెస్ట్




కోడి పందాలు ఆడిన వారిని అరెస్టు చేసిన పోలీసులు

**ఎలిగేడు, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం శివపల్లి గ్రామ శివారులోని బోడా గుట్ట వద్ద రహస్యంగా, చట్టవిరుద్ధంగా కోడిపందాలు నిర్వహిస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సుల్తానాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్దపల్లి డిసిపి రామ్ రెడ్డి మాట్లాడుతూ, "మూడు రోజుల పాటు రెక్కీ నిర్వహించి పకడ్బందీగా 14 మందిని పట్టుకున్నాం. 6 పందెం కోళ్ళు, 6 కత్తులు, 13 మొబైల్స్, ఒక ఎర్టిగా కారు, 7 ద్విచక్ర వాహనాలు, రూ.40 వేల నగదు స్వాధీనం చేసుకున్నాం" అని వివరించారు. "కోడిపందాలు ఆడడం చట్టవిరుద్ధం. వీటిలో పాల్గొనడం, నిర్వహించడం నేరం. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే కాకుండా మూగజీవాలను హింసించడం కూడా చట్టరీత్యా నేరం. ఎక్కడైనా కోడిపందాలు జరుగుతున్న సమాచారం ఉంటే వెంటనే డయల్ 100కు తెలియజేయాలి. సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయి" అని హెచ్చరించారు. ఈ దాడుల్లో పెద్దపల్లి ఏసిపి కృష్ణ, సిఐలు రంజిత్ రావు, ప్రవీణ్, ఎస్సైలు చంద్రకుమార్, సనత్ రెడ్డి, మధుకర్, శ్రీధర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు. "కోడిపందాల ముఠాపై పకడ్బందీగా దాడులు నిర్వహించిన సిబ్బందికి త్వరలోనే నగదు రివార్డులు అందజేస్తాం" అని డిసిపి రామ్ రెడ్డి తెలిపారు.

# ఆసియా క్రీడలకు చికిత ఎంపిక పట్ల హర్షం




**ఎలిగేడు, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఈ ఏడాది సెప్టెంబర్--అక్టోబర్ నెలల్లో జపాన్ వేదికగా జరగబోయే ఆసియా క్రీడల్లో పాల్గొనే భారత ఆర్చరీ జట్లను ప్రకటించారు. మహిళల కాంపౌండ్ విభాగంలో తెలంగాణ రాష్ట్రం పెద్దపల్లి జిల్లా ఎలిగేడు మండలం సుల్తానాపూర్ గ్రామానికి చెందిన తానిపర్తి చికిత ఎంపిక కావడం పట్ల ఆనందం వ్యక్తమైంది. భరోసా స్వచ్ఛంద సేవ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అక్కినపల్లి నాగరాజు మాట్లాడుతూ, "చికిత రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించి గ్రామానికి, దేశానికి మంచి పేరు తేవాలి" అని ఆకాంక్షించారు. గ్రామస్తులు, మండల నాయకులు కూడా చికిత ఎంపికపై హర్షం వ్యక్తం చేస్తూ, "ఆమె ప్రతిభతో ఎలిగేడు పేరు దేశవ్యాప్తంగా వెలుగొందుతుంది" అని అభినందించారు.

# మాడుగుల పోలీస్ స్టేషన్‌ను పరిశీలించిన డీసీపీ



**మాడుగుల, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మహేశ్వరం జోన్ డీసీపీ కె. నారాయణ రెడ్డి, ఐపీఎస్ మంగళవారం మాడుగుల మండలంలోని వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. రైతులకు తాగునీరు, కూర్చునే సదుపాయాలు, పారిశుధ్యం, టోకెన్ పంపిణీ, ధాన్యం తూకం పారదర్శకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. తరువాత ఆయన మాడుగుల పోలీస్ స్టేషన్ను సందర్శించి రికార్డులు, సీసీటీవీ కెమెరాలు, స్టేషన్ పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణను తనిఖీ చేశారు. "ప్రజలతో స్నేహపూర్వకంగా వ్యవహరిస్తూ విధులను అంకితభావంతో నిర్వహించాలి. రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి నేరాలను అరికట్టాలి. రాత్రి పహారా, వాహన తనిఖీలు, బీట్ పోలీసింగ్‌ను బలోపేతం చేయాలి" అని సూచించారు. స్టేషన్ సిబ్బంది పనితీరును అభినందిస్తూ ప్రజా సేవలో నిబద్ధతతో పనిచేయాలని డీసీపీ పిలుపునిచ్చారు.


# కృష్ణానదిలో జాలర్ల సంఘీభావ ర్యాలీ





**విజయవాడ, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఆంధ్ర రాష్ట్రంలో మత్స్యకార సంక్షేమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అందిస్తున్న అండకు కృతజ్ఞతగా జాలర్లు కృష్ణానదిలో బోట్లతో భారీ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. గతేడాది 1,21,433 కుటుంబాలకు రూ.243 కోట్ల సాయం అందించగా, ఈసారి 1,30,796 కుటుంబాలకు రూ.262 కోట్ల ఆర్థిక సహాయాన్ని సీఎం విడుదల చేశారు. రెండేళ్లలో కలిపి కూటమి ప్రభుత్వం రూ.505 కోట్ల సాయం అందించింది. వరుసగా రెండో ఏడాది "మత్స్యకారుల సేవలో" పథకం కింద నిధులు అందుతుండటంతో గంగపుత్రులు ఈ వినూత్న ప్రదర్శన ద్వారా ప్రభుత్వానికి మద్దతు తెలిపారు.

# జాతీయ రహదారిపై లారీని ఢీకొట్టిన కారు



**వెల్దండ, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వెల్దండ మండల కోట్ర చెక్‌పోస్ట్ దగ్గర అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో వంగూరు మండలం సర్వారెడ్డి పల్లి గ్రామానికి చెందిన జాజాల జయమ్మ (34) మృతి చెందగా, ఆమె భర్త, ఇద్దరు కుమార్తెలు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ శ్రీశైలం జాతీయ రహదారిపై ఆగి ఉన్న కంటైనర్ లారీని వీరి కారు ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. స్థానికులు గాయపడిన వారిని కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు జయమ్మ మృతి చెందినట్లు ధృవీకరించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పంట అవశేషాల దహనం మానుకోవాలి

## - రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు




**మాడుగుల, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మాడుగుల రైతు వేదికలో సర్పంచ్ రజిత దేవయ్య అధ్యక్షతన జరిగిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రైతులకు పలు సూచనలు అందించారు. వారు మాట్లాడుతూ, "పంట అవశేషాల దహనం తక్షణ ప్రయోజనం కలిగించినా, దీర్ఘకాలంలో మట్టి ఆరోగ్యం, పోషకాల లభ్యత, పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటుంది. మట్టిలో సూక్ష్మజీవులు, ఎంజైమ్ క్రియాశీలత తగ్గిపోవడం వల్ల పంటల దిగుబడులు తగ్గుతాయి. కార్బన్, నత్రజని, ఫాస్ఫరస్, పొటాషియం వంటి పోషకాలు వాతావరణంలోకి పోతాయి. వాయు కాలుష్యం పెరిగి ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది" అని హెచ్చరించారు. తెలంగాణలో వరి--మొక్కజొన్న పద్ధతి విస్తృతంగా ఉండటం వల్ల అధిక అవశేషాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటిని మల్చింగ్, కంపోస్టింగ్, బయోచార్ తయారీ, పశువుల మేత లేదా బయోఎనర్జీగా వినియోగించడం ద్వారా మట్టిసారాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. "హ్యాపీ సీడర్ వంటి యంత్రాల వినియోగం ద్వారా దహనం చేయకుండా నేరుగా విత్తనాలు వేయవచ్చు. రైతులు అధైర్యపడకుండా పర్యావరణానికి మేలు చేసే పద్ధతులను అనుసరించాలి" అని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అంజయ్య, డాక్టర్ కనకదుర్గ, వ్యవసాయ అధికారి అరుణ కుమారి, విస్తరణ అధికారులు దుర్గా ప్రసన్న, జ్యోత్స్న, ప్రియాంక, భార్గవి, గురు ప్రసాద్ మరియు రైతులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు పేదలకు ఎంతో ఉపయోగపడతాయి


**-నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ శ్రీమతి బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి**




**నల్లగొండ, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మంగళవారం నల్లగొండ కలెక్టరేట్లోని ఉదయాదిత్య భవన్లో నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను డిప్యూటీ మేయర్ మహమ్మద్ అష్రఫ్ అలీ, ఆయా డివిజన్ల కార్పొరేటర్లతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తుందని అన్నారు.

# భక్తులకు అన్నదానానికి విరాళాలు





**శ్రీశైలం, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవస్థానంలో భక్తులకు అన్నప్రసాదవితరణ పథకానికి విరాళాలు అందజేశారు. గుంటూరు జిల్లా భక్తుడు ఎ. మిథిలేష్ రెడ్డి రూ.1,01,000/-ను, హైదరాబాద్‌కు చెందిన సి.హెచ్. సత్యనారాయణ రూ.1,00,116/-ను మంగళవారం సమర్పించారు. దాతలకు దేవస్థానం అధికారులు రశీదు, ప్రసాదాలు, శేషవస్త్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం అధికారులు, అన్నదాతల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# సుందరయ్య ఆశయ సాధనకై అంకితభావం అవసరం



**నందికొట్కూరు, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎం. నాగేశ్వరరావు మాట్లాడుతూ, "బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య ఆశయ సాధనకు మనమందరం అంకితభావంతో పనిచేయాలి" అని పిలుపునిచ్చారు. మంగళవారం సిపిఎం కార్యాలయంలో జరిగిన 41వ వర్ధంతి సభలో ఆయన ప్రసంగిస్తూ, సుందరయ్య జీవిత త్యాగాలను, తెలంగాణ సాయుధ పోరాటంలో పేదలకు భూములు పంచిన సేవలను స్మరించారు. కుల వివక్షత, అంటరానితనానికి వ్యతిరేకంగా ఆయన పోరాటాలను గుర్తుచేశారు. ఈ సందర్భంగా కొత్తగా పార్టీ సభ్యులకు ప్రమాణం చేపించడం జరిగింది. సభలో సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల ప్రతినిధులు, స్థానిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# సుందరయ్య నేటి తరానికి ఎంతో ఆదర్శం



**నల్లగొండ మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** స్వాతంత్ర సమరయోధులు దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి తరానికి ఎంతో ఆదర్శనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు మంగళవారం సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సందర్భంగా 42,47వ డివిజన్ ఆర్టీసీ కాలనీలో తుమ్మల వీరారెడ్డి43వ డివిజన్లో డాక్టర్స్ కాలనీలో ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం సిపిఎం జండావిష్కరణలు చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతో విలువలు కలిగి నిరాడంబరంగా పార్లమెంటు సభ్యుడిగా, శాసనసభ పక్ష నాయకుడిగా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడిన నాయకుడు అని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో సమగ్ర నీటి సరఫరా విధానంపై ఒక పుస్తకము రాసి వివరణాత్మకంగా వివరించడం జరిగిందని అన్నారు. దోపిడీకి వ్యతిరేకంగా తమ ఇంటి నుండే ఉద్యమం ప్రారంభించిన గొప్ప నాయకుడు అని కొనియాడారు. తన భూమిని పేదలకు పంచి భూ పంపిణీ జరగాలని, కష్టించి పనిచేసే వాళ్లకు కూలి గిట్టుబాటు కావాలని కూలి -భూమి పోరాటాలు నడిపిన వీర యోధుడు కామ్రేడ్ సుందరయ్య అని అన్నారు. స్వాతంత్ర పోరాటంలో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా బ్రిటిష్ వారు దేశాన్ని వదిలి వెళ్లాలని విద్యార్థి దశ నుండే ఉద్యమాల్లో పాల్గొన్న నాయకుడు అని అన్నారు నేడు సామ్రాజ్యవాదం పెరిగిపోయి ఇతర దేశాలపై యుద్ధాలు ప్రకటిస్తూ అశాంతికి కారణం అవుతున్న అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా నేడు ఆయన స్ఫూర్తితో పోరాటాలు నడపాల్సిన ఆవశ్యకత ఉందని అన్నారు ఆయన ఆదర్శాలు నేటి తరం పాటిస్తూ వారు కోరుకున్న దోపిడీ లేని సమ సమాజ నిర్మాణానికి కంకణ బద్ధులు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం, పుచ్చకాయల నర్సిరెడ్డి, తుమ్మల పద్మ,ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి అనంతుల శంకరయ్య, తిప్పర్తి మండల కార్యదర్శి మన్నెం బిక్షం, నల్లగొండ పట్టణ కమిటీ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, అవుట రవీందర్, దండెంపల్లి సరోజ, గాదె నరసింహ, పిన్నపురెడ్డి మధుసూదన్ రెడ్డి, అద్దంకి నరసింహ, ఊట్కూరు మధుసూదన్ రెడ్డి, గుండాల నరేష్, కందుల అశోక్, ఎండి సర్దార్ అలీ, కుంభం లక్ష్మమ్మ, మాటూరి సునీత గంజి రాజేష్, బొల్లు రవీంద్ర కుమార్,లకపాక రాజు బాణాల పరిపూర్ణ చారి, బొడ్డుపల్లి సైదులు, వేముల వెంకన్న, కారంపూడి రాము, మాటూరి నరేందర్, సునీత, ముత్తయ్య, కాశయ్య సంతోష తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయాల్లో సుందరయ్య మార్గాన్ని అనుసరించాలి

**-సుందరయ్య పోరాట స్ఫూర్తితో ప్రజల పక్షాన ఉద్యమాలు నిర్వహిస్తాం**

**-పాలడుగు ప్రభావతి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు**




**కనగల్,మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** సిపిఎం కనగల్లు మండల కమిటీ ఆధ్వర్యంలో మహానేత కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 41వ వర్ధంతి సభను మంగళవారం వేములనాగయ్య భవన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు పాలడుగు ప్రభావతి మాట్లాడుతూ, దక్షిణ భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి పుచ్చలపల్లి సుందరయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంతంలో నిజాం నిరంకుశ పాలన, వెట్టి చాకిరి, భూస్వాముల దోపిడీకి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో సాగిన వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి సుందరయ్య సమర్థ నాయకత్వం వహించారని గుర్తు చేశారు. ప్రజల కోసం నిరంతరం పోరాడిన సుందరయ్య జీవితం నేటి రాజకీయ నాయకులకు ఆదర్శమని, ఆయన అనుసరించిన నిబద్ధత, త్యాగం, నిజాయితీ, ప్రజాసేవా మార్గాన్ని ప్రతి ప్రజాప్రతినిధి అనుసరించాలని కోరారు. భూమి కోసం, భుక్తి కోసం, బానిసత్వ విముక్తి కోసం సుందరయ్య నడిపిన వర్గపోరాటాలు నేటికీ ప్రజలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. దేశంలో కేంద్ర బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలను రెచ్చగొడుతూ ప్రభుత్వ వ్యవస్థల్లో కూడా మతాన్ని చొప్పించే ప్రమాదకర విధానాలు అమలు చేస్తోందని ఆమె తీవ్రంగా విమర్శించారు. కార్పొరేట్ అనుకూల, ప్రజా వ్యతిరేక విధానాలతో సామాన్య ప్రజలపై భారాలు మోపుతున్న పాలకులకు వ్యతిరేకంగా ప్రజలను చైతన్యపరిచి ఉద్యమాలు మరింత విస్తృతంగా చేపడతామని తెలిపారు. సుందరయ్య పోరాట పంథానే కమ్యూనిస్టు ఉద్యమాలకు దిక్సూచి అని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాబోయే రోజుల్లో గ్రామాల స్థాయిలో విస్తృత ప్రజా ఉద్యమాలు నిర్మిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకురాలు మద్దెల వినోద, మండల కమిటీ సభ్యురాలు ఎండి సుల్తానా, నాయకులు వేముల సాయమ్మ, కొండ వెంకటేశం, షేక్ రఫీ, మాచర్ల రాములమ్మ, గోగు సత్తయ్య, తాటికొండ బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

## దోపిడీ దొంగలను పట్టుకున్న సీపీకి అభినందనలు




**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** : పీఎంజే జువెలరీలో జరిగిన భారీ నగల దోపిడీ కేసును కేవలం 11 రోజుల్లోనే చేధించి, అంతర రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసిన కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం ప్రజల్లో విశ్వాసం నింపారని జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్ అభినందించారు.మంగళవారం ఆయన పలువురు కాంగ్రెస్ నేతలతో కలిసి కమిషనరేట్‌లో గౌస్ అలంను కలుసుకుని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం శాంతిభద్రతల విషయంలో ఎక్కడా రాజీ పడకుండా పనిచేస్తోందని, 11 రోజుల్లోనే దొంగలను పట్టుకోవడం పోలీసు శాఖ చిత్తశుద్ధికి నిదర్శనమని అన్నారు.ప్రతిపక్షాలు కావాలని దుష్ప్రచారం చేయడం సిగ్గుచేటని, పోలీసులు రేయింబవళ్లు కష్టపడి కేసును చేధిస్తుంటే అసత్య ఆరోపణలు చేయడం వారి దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణ కోసం పనిచేసే పోలీస్ వ్యవస్థపై గౌరవంగా ప్రవర్తించాలని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో నేరస్తులు ఎవరైనా తప్పించుకోలేరు, ఈ ఘటన దానికి నిదర్శనం" అని పులి ఆంజనేయులు గౌడ్ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, తాడిజెర్రి సర్పంచ్ రామిడి రాజిరెడ్డి, కిసాన్ సెల్ వైస్ ప్రెసిడెంట్ నూనె గోపాల్ రెడ్డి, వంగల విద్యాసాగర్, కుంబాల రాజ్ కుమార్, గంగుల దిలీప్ కుమార్, బండిపెల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మంగపేట చెక్‌పోస్ట్‌లో ఆకస్మిక తనిఖీ నిర్వహించిన పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం



**గంగాధర, జూన్ 18 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** బక్రీద్ పండుగ సందర్భంగా అక్రమంగా ఆవులు, గోవులు మరియు నిషేధిత జంతువుల రవాణాను అరికట్టేందుకు గంగాధర మండలంలోని మంగపేట చెక్‌పోస్ట్‌ను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చెక్‌పోస్ట్ వద్ద జరుగుతున్న తనిఖీలను సమీక్షించిన కమిషనర్, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని, ముఖ్యంగా పశువులను తరలించే వాహనాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సిబ్బందికి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా జంతువుల రవాణా జరిగితే వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.రాత్రి వేళల్లో మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని, చెక్‌పోస్ట్ వద్ద సీసీ కెమెరాలు, లైటింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. అనుమానాస్పద వాహనాల కదలికలపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు.జంతు అక్రమ రవాణాను అరికట్టడంలో ప్రజల సహకారం అవసరమని కమిషనర్ విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో రూరల్ ఏసీపీ విజయ్ కుమార్, చొప్పదండి సీఐ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.బక్రీద్ సందర్భంగా శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు కఠిన చర్యలు చేపడుతున్నారు.

# బీసీ ప్రభంజనం విజయవంతం చేయాలి

**- ఉప్పు సత్యనారాయణ**




**ఎల్బీనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మే 24న ఎల్బీనగర్ ఎస్‌కే గార్డెన్‌లో జరగబోయే బీసీ ప్రభంజనం సభను విజయవంతం చేయాలని కన్వీనర్ ఉప్పు సత్యనారాయణ పిలుపునిచ్చారు.మంగళవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ, "ప్రభంజనం సభ రాజకీయాలకు అతీతంగా జరుగుతుంది. ఏ వర్గానికి వ్యతిరేకంగా కాదు, బీసీ వాదాన్ని బలోపేతం చేయడానికి మాత్రమే ఈ సభ జరుగుతుంది. ఎల్బీనగర్ ప్రాంతం ఎన్నో సామాజిక ఉద్యమాలకు కేంద్రంగా నిలిచింది. ఈ సభ కూడా చారిత్రాత్మకంగా నిలుస్తుంది" అని అన్నారు.సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షుడు చామకూర రాజు మాట్లాడుతూ, "గతంలో బీసీ జన భోజనాలకు వేలాది మంది స్వచ్ఛందంగా కదిలి వచ్చారు. ఈ సభ బీసీ ఉద్యమానికి దిశానిర్దేశం చేస్తుంది" అని పేర్కొన్నారు. పార్టీ తెలంగాణ ఇంచార్జి కె.వి. గౌడ్ జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు.బీసీ సంఘం నాయకుడు కందికంటి శ్రీధర్ గౌడ్ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గంలో బీసీలకు పది డివిజన్లు కేటాయించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏకం కావాల్సిన అవసరం ఉందని జెఏసి కన్వీనర్ తెలంగాణ వెంకన్న అన్నారు. రాంకోఠి మాట్లాడుతూ, "చట్టసభల్లో రిజర్వేషన్లు కేటాయించే వరకు రాజీలేని ఉద్యమం కొనసాగుతుంది" అని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బీసీ నేతలు చింతల విజయ్, ఉపేందర్ యాదవ్, బాలస్వామి, ప్రశాంత్, రమేష్, దూడల అమర్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీధర్ ముదిరాజ్, శ్రీధర్ దర్జీ, హరి శంకర్ గౌడ్, తానాజీ, అనిల్ గౌడ్, భువనేశ్వర్, కార్తీక్, రావుల సంతోష్ గౌడ్, రవి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధిహామీ పనులు ప్రారంభం



**ఆమనగల్లు, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కడ్తాల్ మండలం చరికొండ గ్రామ సమీపంలోని నాగప్ప చెరువులో మంగళవారం ఉపాధి హామీ పనులను సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను కూలీలు సభ్యులను చేసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ పనులకు కూలీలు ఎక్కువ సంఖ్యలో వచ్చేలా చూడాలని తెలిపారు. వేసవి కాలం అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఉపాధి కూలీలు తప్పనిసరిగా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే సమయంలో తరచూ నీరు తాగడం, తలపై గుడ్డ లేదా టోపీ ధరించడం, మధ్య మధ్యలో విశ్రాంతి తీసుకోవడం, అవసరమైనప్పుడు ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవడం ద్వారా నీరసం, అలసట వంటి సమస్యలను నివారించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బలవంత్ రెడ్డి, సెక్రటరీ పాషా, వార్డు సభ్యులు నర్సింహా, బాలమణి, సాప మంజుల శ్రీను, చిన్న బౌరమ్మ, లాలయ్య, ఉమ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారమివ్వాలి




**ఆమనగల్లు, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఎన్యూమరేటర్లకు సమగ్ర సమాచారం ఇవ్వాలని ఉప సర్పంచ్ విజయ్ రాథోడ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో కొనసాగుతున్న జనగణన సర్వేను ఆయన పరిశీలించారు. సర్వేకు వచ్చే ఎన్యూమరేటర్లకు ఇంటి యజమానులు పూర్తిగా తగిన సమాచారం అందజేసి వారికి సహకరించాలన్నారు. జూన్ 12 వరకు నిర్వహించే సర్వేకు ప్రజలు అందుబాటులో ఉండి సర్వేను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బిఎల్ఓ వి. సరోజ, ఎం. సరోజ, ఎన్యూమరేటర్లు, సిబ్బంది శ్రీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## గో సంరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**- షాద్ నగర్ పట్టణానికి చెందిన జి.శ్రీనివాస్ రెడ్డి**

**- గో సంరక్షణకు ఒక ట్రాక్టర్ వరిగడ్డి కట్టలు అందజేత**



**షాద్ నగర్, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** గో సంరక్షణకు ప్రతి ఒక్కరు తమ వంతు బాధ్యతగా కృషి చేయాలని, గోవులను పూజిస్తే సకల శుభాలు కలుగుతాయి అని షాద్ నగర్ పట్టణానికి చెందిన జి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌడమ్మగుట్ట శ్రీకృష్ణ గోశాలకు ట్రాక్టర్ లోడ్ గడ్డి కట్టలు దానం చేశారు. గోవుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని వాటి ఆకలి తీర్చేందుకు పశుగ్రాసం అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పశువులకు గడ్డి దానం చేసిన జి శ్రీనివాస్ రెడ్డి కు దేవాలయం కమిటీ మాజీ సర్పంచ్ పులిమామిడి శ్రీశైలం గౌడ్, వారికి ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో, .మాజీ వార్డు సభ్యులు సింగపాగ లక్ష్మయ్య తదిరులున్నారు.

# ఎవరి కులం ఎంతో..! వారికంత వాటా..!

### -బహిరంగ సభను జయప్రదం చేద్దాం



**ఆమనగల్లు, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** బీసీ, ఎస్సీ, ఎస్టీ - జేఏసీ తెలంగాణ చైర్మన్ డాక్టర్ విశారధన్ మహరాజ్ ఆదేశానుసారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ కేంద్రంలో ఈనెల 28వ తేదీన తలపెట్టినటువంటి ఎవరి కులం ఎంతో..! వారికంత వాటా..! భారీ బహిరంగ సభకు చెందిన గోడ పత్రిక, వాల్ పోస్టర్లను కల్వకుర్తి నియోజకవర్గం బీసీ,ఎస్సీ,ఎస్టీ-జేఏసీ కో-ఆర్డినేటర్ వంకేశ్వరం రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలోని అంబేద్కర్ విగ్రహం వద్ద రాష్ట్ర జేఏసీ అధ్యక్షులు రాఘవేంద్ర ముదిరాజ్, జిల్లా అధ్యక్షులు రజినీకాంత్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో సామాజిక న్యాయం రాజ్యాధికారం కొరకై డాక్టర్ విశారదన్ మహరాజ్ నాయకత్వంలో 90% ప్రజల పక్షాన భారత రాజ్యాంగం ప్రకారం రాజకీయ వాటా ఆర్థిక వాటా సామాజిక న్యాయం వంటి అంశాలపై తరతరాలుగా దోపిడికి గురై బానిసలుగా నలిగిపోయి జీవిస్తున్నారని వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం కోసం మరియు న్యాయంగా ధర్మంగా సామాజిక న్యాయం జరగాలంటే అన్ని రంగాల్లో ఎవరి కులం ఎంత ఉందో వారికి అంత వాటా ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందన్నారు. ఈ బహిరంగ సభ ద్వారా ప్రజలందరికీ తెలియజేసి వారిని చైతన్య పరుస్తూ తెలంగాణ గడ్డపై బహుజన సామాజిక వర్గాలకు చెందిన రాజ్యాధికారం సాధించడం కోసం భారీ ఎత్తున బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. భారీ బహిరంగ సభకు 90 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ అగ్రకుల ప్రజాస్వామ్య వాదులంతా పాల్గొని సభను జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రమేష్, మల్లేష్, జంతుక యాదగిరి, కొండల్ యాదవ్, ప్రవీణ్, మహేష్, వస్పుల కృష్ణ, పుల్లయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

### మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ గౌడ్



**ఆమనగల్లు, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** పట్టా పాస్‌బుక్ కలిగిన ప్రతీ రైతు కూడా ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి పెద్ది శ్రీనివాస్ గౌడ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని సంప్రదించి ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ఆధార్ ద్వారా దేశంలోని ప్రతి పౌరుడికి గుర్తింపు ఇచ్చినట్లుగానే, రైతులకు 11 అంకెలతో కూడిన ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూనిక్ కోడ్) కేటాయించనున్నట్లు తెలిపారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేస్తున్నామని చెప్పారు. భూమి కలిగిన ప్రతి రైతు, తన భూములకు సంబంధించిన అన్ని వివరాలతో ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని సూచించారు.పీఎం కిసాన్ లబ్ధిదారులు తదుపరి విడత నిధులు పొందడానికి కూడా ఈ రిజిస్ట్రీ తప్పనిసరిగా చేయాల్సి ఉంటుందని శ్రీనివాస్ గౌడ్ స్పష్టం చేశారు.

ఆమనగల్లు మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ కోసం

1) బాలకృష్ణ ఏఈఓ (ఆమనగల్లు) 6305920207
2) మీనాక్షి ఏఈఓ (రాంనుంతల) క్లస్టర్ 6305920210
3) భూదేవి ఏఈఓ (ఆకుతోటపల్లి) క్లస్టర్ 6305920208
4) ప్రభావతి ఏఈఓ (పోలేపల్లి) క్లస్టర్ 6305920209

# అమరవీరుల ఆశయ సాధనకు బస్సు యాత్ర



**మర్రిగూడ, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండల కేంద్రంలో తెలంగాణ అమరవీరుల ఆశయ సాధన సమితి ఆధ్వర్యంలో బస్సు యాత్ర నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోరే సాయిరాం చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల హామీగా అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటానని, ఉద్యోగాలు కల్పిస్తానని చెప్పినా ఇప్పటివరకు నిజమైన ఉద్యమకారులను పట్టించుకోలేదు. ఇకనైనా అమరవీరులను, కళాకారులను, మేధావులను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇవ్వాలి" అని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అమరవీరుల కుటుంబ సభ్యులు, ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కొలుకులపల్లి యాదయ్య, వెంకటంపేట బాలయ్య, వరికుప్పల కాళహస్తి బుల్లెట్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


# బావి కూలి ఇద్దరు కూలీలు మృతి, ఒకరికి తీవ్ర గాయాలు



**పాలకుర్తి, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** జయ్యారం గ్రామంలో మంగళవారం వ్యవసాయ బావి కూలిపోవడంతో ఇద్దరు కూలీలు మట్టిలో కూరుకుపోయి మృతి చెందగా, మరోకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాల ప్రకారం, మామిడాల రాజయ్యకు చెందిన బావిలో సిమెంట్ గాజు పనులు చేస్తుండగా అకస్మాత్తుగా అంచు కూలి మట్టి పెళ్ళలు పడడంతో వడ్కాపూర్ గ్రామానికి చెందిన బీమోజు అంజయ్య, పెద్దపల్లికి చెందిన రేషవేణి రాజయ్య అక్కడికక్కడే మృతి చెందారు. సాగర్ల శ్రీనివాస్ తీవ్ర గాయాలతో బయటపడగా స్థానికులు అతన్ని 108లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పెద్దపల్లి డీసీపీ భూక్య రాంరెడ్డి, ఏసీపీ గజ్జి కృష్ణ, సీఐ ప్రవీణ్ కుమార్, బసంతనగర్ ఎస్ఐ నూతి శ్రీధర్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాలను ప్రోక్లైన్ సహాయంతో బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మక్కన్ సింగ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలను ఓదార్చారు. వరుసగా ప్రమాదాలు, నేర సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. జయ్యారం గ్రామంలో జరిగిన ఈ ప్రమాదం స్థానికులను కలచివేసింది.

# గుర్రంపోడ్ లో 108 సేవలు అమోఘం..

### - సిబ్బంది పనితీరుపై అధికారుల ప్రశంసలు



**గుర్రంపోడు,మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నల్గొండ జిల్లా 108 సేవల జిల్లా మేనేజర్ ప్రదీప్ గుర్రంపోడు 108 అంబులెన్స్‌ను సందర్శించి అందులోని అత్యాధునిక పరికరాల పనితీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంబులెన్స్‌లో అన్ని సౌకర్యాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. అంబులెన్స్‌లో ఆటోమేటెడ్ ఎక్స్‌టర్నల్ డీఫిబ్రిలేటర్, అంబు బ్యాగ్, గ్లూకోమీటర్ తదితర ఆధునిక పరికరాలు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో నిర్భయంగా 108 సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల ప్రోగ్రాం మేనేజర్ సలీమ్ మాట్లాడుతూ అంబులెన్స్‌లో అన్ని రకాల అత్యవసర మందులు, గ్లూకోజ్‌లు, వైద్య పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో వడదెబ్బ బాధితుల కోసం కూల్ ప్యాడ్స్, టవల్స్ వంటి ప్రత్యేక సదుపాయాలు కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రోడ్డు ప్రమాదాల పట్ల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, వారి సేవలను అధికారులు అభినందించారు. గత మూడు నెలల కాలంలో గుర్రంపోడు 108 అంబులెన్స్ ద్వారా 130 గర్భిణీ కేసులు, 145 మెడికల్ కేసులు, 55 రోడ్డు ప్రమాద కేసులు, 20 విషప్రయోగ కేసులు సహా మొత్తం 350 కేసులను ఆస్పత్రులకు తరలించి అనేక మంది ప్రాణాలను కాపాడినట్లు జిల్లా మేనేజర్ ప్రదీప్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆన్ డ్యూటీ సిబ్బంది ఈఎంటీలు గిరి, సత్యనారాయణ, పైలట్లు వెంకట్, శివాజీ పాల్గొన్నారు. వీరు 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

# ధాన్యాన్ని త్వరగా మిల్లులకు పంపాలి



**ఆమనగల్లు, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తూకం వేసిన ధాన్యం బస్తాలను వెంట వెంటనే మిల్లులకు పంపాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ సివిల్ సప్లై డీఎస్పీ శ్రీ రమేష్ రెడ్డి, డీఎస్ఎస్ఓ నవజాత ఆదేశించారు. ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ యార్డులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సకాలంలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ధాన్యం తూకం, నిల్వ, రవాణా ప్రక్రియల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేయకూడదని ఆయన అన్నారు. రైతులకు సమగ్ర సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు వారు తెలిపారు. అకాల వర్షాలు ఉన్నందున వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు కొనుగోలు కేంద్రాల వద్ద గన్ని సంచులు, తార్పాలిన్లు అందుబాటులో ఉంచుకోవాలని ఆయన అన్నారు. కొనుగోలు చేసి వెంటనే డాటా ఎంట్రీ చేసి రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యే విధంగా చూడాలని ఆయన అన్నారు. రైస్‌మిల్లుల వద్ద త్వరగా అన్‌లోడింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని వారు అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డైరెక్టర్లు డైరెక్టర్లు తాళ్ల రవీందర్, జెల్ల రమేష్ గౌడ్, సంపత్ కుమార్, నరేష్ నాయక్, నాయకులు మెకానిక్ బాబా, శ్రీను నాయక్, సింగల్ విండో సెక్రటరీ దేవేందర్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు టీజీపీటీ చైర్మన్ సూదినికి అభినందన సభ



**ఆమనగల్లు, మే 19 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ పంచాయతీ ట్రిబ్యునల్ చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన టీపీసీసీ కార్యదర్శి, మాడ్గుల మాజీ ఎంపీపీ సూదిని రాంరెడ్డికి నేడు (బుధవారం) పట్టణ కేంద్రంలోని శ్రీ లక్ష్మీ గార్డెన్స్ ఫంక్షన్ హాల్లో అభినందన సన్మాన సభను విజయవంతం చేయాలని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈమేరకు మంగళవారం విలేకరుల సమావేశంలో అయాన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని 7 మండలాల 2 మున్సిపాలిటీల పరిధిలోని ప్రజలు, కార్యకర్తలు, వివిధ పార్టీల నేతలు రాజకీయాలకతీతంగా హాజరై సన్మాన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని శ్రీనివాస్ గౌడ్ కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, మాడుగుల, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వస్పుల శ్రీశైలం, ఆమనగల్లు మండలాల అధ్యక్షులు భట్టు కిషన్ రెడ్డి, తెల్గమల్ల జగన్, మాజీ జడ్పిటిసి శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ నిట్ట నారాయణ, కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి ప్రసాద్, ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్, కొండల్ రెడ్డి, దేవరశెట్టి మహేష్, కుమార్ గౌడ్ తదితరులు ఉన్నారు.

# కృష్ణానది తీరంలో టూరిజం అవగాహన



**కొల్లాపూర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజా పాలనా--ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమశిల క్షేత్రంలోని కృష్ణానది తీరంలో రత్నగిరి ఫౌండేషన్ విద్యార్థినులకు టూరిజం అవగాహన కార్యక్రమం జరిగింది.జిల్లా పర్యాటక శాఖ అధికారి కల్వరాల నరసింహ మాట్లాడుతూ, "సోమశిల పరిసరాల్లో పర్యాటక అభివృద్ధి వేగంగా జరుగుతోంది. సిద్దేశ్వరం కేబుల్ వంతెన నిర్మాణం రెండు తెలుగు రాష్ట్రాల రాకపోకలకు సౌలభ్యం కలిగిస్తుంది. మల్లేశ్వరం ఐల్యాండ్‌లో కాటేజ్‌లు నిర్మాణం పూర్తయితే పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. సోమశిల, సంగమేశ్వరం వంటి ఆధ్యాత్మిక ప్రదేశాలు టూరిజం అభివృద్ధికి తోడ్పడుతున్నాయి" అని వివరించారు. ఈ కార్యక్రమంలో సోమశిల గ్రామ సర్పంచ్ కాటం వెంకటలక్ష్మి వెంకటస్వామి, ఉప సర్పంచ్ ఖాదర్ పాషా, మాజీ సర్పంచ్ బింగి మద్దిలేటి, టూరిస్ట్ పోలీసులు, పర్యాటక సిబ్బంది పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు




**పెద్దపల్లి, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం రావాలని జాతీయ హరిత దళం జిల్లా కోఆర్డినేటర్ గూళ్ల అంజన్ కుమార్ అన్నారు. అప్పన్నపేట జడ్పీహెచ్ఎస్ బాలికల పాఠశాలలో తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, జాతీయ హరిత దళం సహకారంతో 99 రోజుల పర్యావరణ అవగాహన కార్యక్రమంలో భాగంగా వేసవి శిబిరం నిర్వహించారు. రక్షించడం--సంరక్షించడం--ప్రోత్సహించడం నినాదంతో విద్యార్థులకు పర్యావరణ సమస్యలపై విస్తృత అవగాహన కల్పించారు. జల వనరుల కొరత, కాలుష్యం, ప్లాస్టిక్ వినియోగం, పరిశుభ్రత లోపం, పచ్చదనం తగ్గిపోవడం వంటి అంశాలపై చర్చలు జరిపారు. విద్యార్థుల్లో చైతన్యం పెంపొందించేందుకు స్కిట్స్, డ్యాన్స్, యోగా, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు జిల్లా విద్యాధికారి జి. శారద సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ పి.ఎం. షేక్, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్, వంగ అశోక్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో విద్యార్థులు పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు అవుతామని ప్రతిజ్ఞ చేశారు.

# రైతులకు పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ







**పాలకుర్తి, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా పాలకుర్తి రైతు వేదికలో పచ్చి రొట్ట విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి రైతులతో ముచ్చటిస్తూ పచ్చి రొట్ట వాడకం, సమతుల్య ఎరువుల వినియోగం, అధిక రసాయన ఎరువులు తగ్గించడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. కేవికే రామగిరిఖిల్లా శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ జీవ ఎరువుల వినియోగం పెంచి యూరియా వినియోగాన్ని 25 శాతం వరకు తగ్గించాలని, నానో ఎరువులను ఉపయోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ బండి ప్రమోద్ కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎం. యోజన, బి. శశిధర్‌తో పాటు రైతులు పాల్గొన్నారు. పచ్చి రొట్ట విత్తనాల వినియోగం ద్వారా భూసారాన్ని కాపాడుతూ రైతులు స్థిరమైన సాగు పద్ధతుల వైపు అడుగులు వేయాలని అధికారులు సూచించారు.

# 4వ డివిజన్‌లో మడెలయ్య గుడికి బోర్‌వెల్ ఏర్పాటు



**కరీంనగర్ రూరల్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
4వ డివిజన్ కార్పొరేటర్ భూపతి రవీందర్ కృషితో ఎంపీ బండి సంజయ్ కుమార్ నిధులతో రజక సంఘం మడెలయ్య గుడిలో బోర్‌వెల్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కోరుకంటి వేణు మాధవరావు, కోరుకంటి వెంకటేశ్వరరావు, గజే మల్లేష్ పటేల్, రజక సంఘం అధ్యక్షులు నేరెళ్ల అంజయ్య, మల్లయ్య, రాజయ్య, కామరాజు కుమార్, మహేష్, చంద్రయ్య, అంజయ్యతో పాటు బీజేపీ నాయకులు పత్తేమ్ ప్రకాష్, న్యాత శ్రీధర్, మెండే పునిందర్ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు తాగునీటి సౌకర్యం కల్పించేందుకు ఈ బోర్‌వెల్ ఉపయోగపడనుందని నాయకులు తెలిపారు.

## కేంద్రంపై సుడా చైర్మన్

# నరేందర్ రెడ్డి తీవ్ర విమర్శలు



**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలు పెంచుతూ సామాన్యుడి నడ్డి విరుస్తోందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, నాలుగు రోజుల్లో లీటరుకు నాలుగు రూపాయల చొప్పున ధరలు పెంచడం ప్రజలపై తీవ్ర భారం మోపుతోందని అన్నారు. మోదీ సర్కార్ వైఫల్యం వల్లే నీట్ పరీక్షా పత్రం లీక్ అయిందని, దేశవ్యాప్తంగా 26 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని నరేందర్ రెడ్డి విమర్శించారు. ప్రధాని మైకు దొరికితే మాటల గారడి చేస్తారు, కానీ పాలన మాత్రం చేతకాదు అని ఆయన వ్యాఖ్యానించారు. బీజేపీ ప్రభుత్వం విడతల వారీగా ధరలు పెంచుతూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని, కార్పొరేట్ శక్తులకు కోట్ల రూపాయల ప్రజాధనం ధారాదత్తం చేస్తూ సామాన్యుడిని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. పెంచిన ధరలను వెంటనే తగ్గించాలని, లేకపోతే కాంగ్రెస్ పార్టీ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అప్పులపాలు చేసిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో ముందుకు తీసుకెళ్తోందని, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పగడ్బందీగా పోటీ పరీక్షలు నిర్వహించి 70 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని నరేందర్ రెడ్డి తెలిపారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపును వెనక్కి తీసుకోవాలని, నీట్ పత్రం లీక్‌పై బీజేపీ నాయకులు దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## ధాన్యం కొనుగోళ్లపై బీఆర్ఎస్

# ఆరోపణలు అవాస్తవం


**- కంది తిరుపతిరెడ్డి**



**హుస్నాబాద్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోళ్ల అంశంపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. మార్కెట్ యార్డులో మున్సిపల్, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ సభ్యులతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం సమర్థవంతంగా కొనుగోళ్లు నిర్వహిస్తోందని తెలిపారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నాయకులు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఇప్పటివరకు 50 వేల మెట్రిక్ టన్నుల వరి, 40 వేల టన్నుల మొక్కజొన్న కొనుగోలు చేశామని, రైతులను దళారీ వ్యవస్థ నుంచి కాపాడేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. హుస్నాబాద్‌లో విద్యా, వైద్య రంగాల అభివృద్ధి, సీసీ రోడ్ల నిర్మాణం, ఇంజనీరింగ్ కళాశాల, 200 పడకల ఆసుపత్రి వంటి పలు కార్యక్రమాలు కొనసాగుతున్నాయని వివరించారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌పై ఫోటోలకు ఫోజులిస్తున్నాడు అంటూ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడటం సిగ్గుచేటని, ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్న నాయకుడిపై ఇలాంటి వ్యాఖ్యలు తగవని మండిపడ్డారు. ఖబర్దార్... మా మంత్రి పొన్నం గురించి అనవసరంగా మాట్లాడితే బాగుండదు అంటూ బీఆర్ఎస్ నాయకులకు హెచ్చరిక జారీ చేశారు. ఈ సమావేశంలో సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వైస్ చైర్మన్ బంక చందు, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణా చేస్తూ ట్రాక్టర్ బోల్తా

**- యువకుడు మృతి**





**కరీంనగర్ రూరల్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
దుర్శేడ్ గ్రామ శివారులో మంగళవారం తెల్లవారుజామున అక్రమ ఇసుక రవాణా చేస్తూ ట్రాక్టర్ బోల్తా పడడంతో యువకుడు గున్నల హరీష్ (31) మృతి చెందాడు. పోలీసులు వాహనాల తనిఖీ చేస్తుండగా పట్టుబడతానేమోనని భయంతో అతివేగంగా ట్రాక్టర్ నడిపి అదుపు తప్పడంతో ప్రమాదం జరిగింది. తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించినా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. హరీష్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో కూడా అక్రమ ఇసుక రవాణా కేసులు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

# సంస్కృత పేపర్ల వాల్యుయేషన్ బకాయిలు విడుదల చేయాలని డిమాండ్




**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత మార్చి నెలలో జరిగిన ఇంటర్మీడియట్ సంస్కృత పరీక్షల పేపర్ల వాల్యుయేషన్‌కు సంబంధించిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని సంస్కృత సంఘం సభ్యులు, అధ్యక్షులు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఈఓ)కు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ, పేపర్ల మూల్యాంకనం పూర్తి చేసి రెండు నెలలు గడిచినా ఇప్పటివరకు బకాయిలు అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే సప్లిమెంటరీ పేపర్ల వాల్యుయేషన్ చేయబోమని స్పష్టం చేశారు. ఈ సమస్యను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంస్కృత సంఘం అధ్యక్షులు, సభ్యులు కె. రవీందర్, కె. శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. బకాయిలు విడుదలయ్యే వరకు సప్లిమెంటరీ పేపర్ల వాల్యుయేషన్ చేయము అని సభ్యులు హెచ్చరించారు.

# ఎంపీ బండి సంజయ్‌పై యూత్ కాంగ్రెస్ ఫిర్యాదు



**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
పోక్సో కేసులో నిందితుడైన బండి సాయి భగీరథ్‌ను చట్టం నుండి రక్షించడానికి ఎంపీ బండి సంజయ్ కుమార్ తన అధికార బలాన్ని వినియోగిస్తున్నారని ఆరోపిస్తూ యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి వి. శ్యాంసుందర్ రెడ్డి కరీంనగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. శ్యాంసుందర్ రెడ్డి మాట్లాడుతూ, కోర్టు ముందస్తు బెయిల్ తిరస్కరించినప్పటికీ, లుకౌట్ నోటీసులు జారీ చేసినప్పటికీ నిందితుడిని దాచిపెట్టారని, ఈ సమయంలో డిజిటల్ సాక్ష్యాలను ధ్వంసం చేసే ప్రయత్నాలు జరిగాయని ఆరోపించారు. మరింతగా, బండి సంజయ్ ఐటీ వింగ్ మరియు అనుచరులు సోషల్ మీడియాలో బాధితురాలి వ్యక్తిగత వివరాలు, ఫోటోలు, వీడియోలు లీక్ చేసి ఆమె మానసిక స్థైర్యాన్ని దెబ్బతీసేలా ప్రవర్తించారని మండిపడ్డారు. అంతేకాకుండా, విచారణలో న్యాయమూర్తి అడిగిన ప్రశ్నను వక్రీకరించి న్యాయవ్యవస్థను కించపరిచేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారని డిజిటల్ సాక్ష్యాలను పోలీసులకు సమర్పించారు. ఈ అక్రమాలకు పాల్పడిన వారిపై భారతీయ న్యాయ సంహిత మరియు పోక్సో చట్టాల ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేసి తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు మరియు బాధితురాలి కుటుంబానికి ప్రాణహాని ఉందని, తగిన పోలీస్ రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు అబ్దుల్ రహమాన్, ఆశీష్ రెడ్డి, సిటీ ఉపాధ్యక్షులు బుర్ర రాహుల్ గౌడ్‌తో పాటు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. బాధితురాలికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగుతుంది అని నాయకులు స్పష్టం చేశారు.

# ఎస్ఆర్ఆర్ కళాశాలలో రెండు లక్షల విత్తన బంతుల ఉద్యమంకు శ్రీకారం

**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

ప్రకృతిని కాపాడే పుణ్యకార్యంగా శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వృక్షశాస్త్ర విభాగం, ఎన్ఎస్ఎస్, ఎకో క్లబ్ ఆధ్వర్యంలో రెండు లక్షల విత్తన బంతుల ఉద్యమంకు శ్రీకారం చుట్టారు. ప్రొఫెసర్ తిరుక్కోవెల శ్రీనివాస్ నేతృత్వంలో, డాక్టర్ పడాల తిరుపతి ఆర్గనైజింగ్ సెక్రటరీగా, సహాయ ఆచార్యులు డాక్టర్ రఘు రాధాకృష్ణ, డాక్టర్ మహమ్మద్ తాహీర్ హుస్సేన్, శ్రీమతి కందుకూరి కళాజ్యోతి, డాక్టర్ బుంగ తిరుపతి, శ్రీ ఎండి తాజుద్దీన్, శ్రీమతి ఆసంపల్లి స్వరూపారాణి తదితరులు ఈ ఉద్యమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఉద్యమ వాల్ పోస్టర్‌ను డాక్టర్ కడారు సురేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, ప్రతి సంవత్సరం వందలాది మొక్కలను నాటి సంరక్షించడం సమాజానికి ఆదర్శం అని అభినందించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. రామకృష్ణ మాట్లాడుతూ, ఇది కళాశాల చరిత్రలో విశిష్టమైన పర్యావరణహిత కార్యక్రమమని, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యత పెంపొందించే గొప్ప ఉద్యమమని అన్నారు. ప్రొఫెసర్ తిరుక్కోవెల శ్రీనివాస్ మాట్లాడుతూ, విత్తన బంతుల ద్వారా అడవుల విస్తరణ, జీవ వైవిధ్య పరిరక్షణ, వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని, అటవీ శాఖ, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ అంబాల శంకరయ్య, చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కె. సుధాకర్, ఆంగ్ల విభాగాధిపతి డాక్టర్ నీలం శ్రీనివాసులు, ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రొఫెసర్ ఆడెపు శ్రీనివాసులు, జంతుశాస్త్ర ఉపాధ్యాయులు డాక్టర్ తోట మహేష్ తదితరులు పాల్గొన్నారు. ప్రకృతిని కాపాడే పుణ్యకార్యంగా ఈ ఉద్యమం విద్యార్థుల్లో పర్యావరణ చైతన్యాన్ని పెంపొందిస్తోంది.




# ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమంలో విద్యార్థులకు ఘన సన్మానం

**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ కరీంనగర్ ప్రేరణ రీజియన్--9 ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభకు పట్టాభిషేకం కార్యక్రమం ఉత్సాహభరితంగా జరిగింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతిలో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన ప్రతిభావంతులైన విద్యార్థులను ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేష్ ఆత్మారామ్ మహరాజ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలకు చెందిన దాదాపు 250 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, మోటివేషనల్ స్పీకర్ల ఉపన్యాసాలు సభికులను ఆకట్టుకున్నాయి. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెరిగి, ఉన్నత లక్ష్యాల వైపు ప్రోత్సాహం లభించిందని పలువురు అభిప్రాయపడ్డారు. విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు నిర్వాహకులను అభినందించారు. కార్యక్రమంలో తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి వూట్కూరి, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ రీజియన్--9 ప్రెసిడెంట్ ఇజ్జగిరి శ్రీనివాస్, ఐసిఐ నేషనల్ కమిటీ సభ్యులు కె. మాధవి, కె. రామచంద్రుడు, వి. మహేందర్, కె. తిరుపతి, శ్రీకర్, సాయిబాబు, జాహ్నవి, జీ. రవీందర్, మేరుగు నరేష్, రాపల్లి లింగమూర్తి, మల్లయ్య, పైడ శ్రీనివాస్, చొక్కారపు శ్రీనివాస్, నార్ల శ్రీనివాస్, కలికోట శ్రీనివాస్, ఉప్పుగండ్ల శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, బాలాజీ, అన్నపూర్ణ సేవా సమితి సభ్యులు రాచమల్ల ప్రసాద్, డా. చందా శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు. ప్రతిభను గుర్తించి సన్మానించిన ఈ కార్యక్రమం విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది.





# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

**పెద్దపల్లి, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడిన నిందితుడిని పోలీసులు పట్టుకున్నారు. కూనారం రైల్వే గేట్ వద్ద అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించగా, గతంలో చేసిన దొంగతనాలను ఒప్పుకున్నాడు. నిందితుడు ఊరడి జనార్ధన్, నల్గొండ జిల్లా రంగారెడ్డిగూడెం గ్రామానికి చెందినవాడు. కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. కుటుంబ ఖర్చులు తీరకపోవడంతో స్నేహితులు తమ్మిశెట్టి వెంకటేష్, మణికంఠతో కలిసి తాళాలు వేసిన ఇళ్లలో దొంగతనాలు చేసి నగదు, బంగారం దొంగిలించేవారు. 2025 సెప్టెంబర్‌లో వరంగల్, కరీంనగర్ మీదుగా పెద్దపల్లికి చేరుకుని సుల్తానాబాద్ శివారులో స్కూటీ దొంగిలించారు. అదే నెల 15న నిమ్మనపల్లి గ్రామంలో ఒక ఇంటి తాళం పగులగొట్టి బంగారం, వెండి ఆభరణాలు దొంగిలించారు. అనంతరం గుంటూరు మీదుగా గోవాకు వెళ్లి కొంత బంగారం అమ్మి వచ్చిన డబ్బుతో జల్సాలు చేశారు. తన వద్ద రెండు తులాల బంగారు గొలుసు ఉంచుకున్న జనార్ధన్ మరోసారి దొంగతనం చేయాలనే ఉద్దేశంతో పెద్దపల్లికి వచ్చిన సమయంలో పోలీసులు పట్టుకున్నారు. రెడ్ కలర్ బలెనో కారు, బంగారు గొలుసు స్వాధీనం చేశారు. ఈ కేసు దర్యాప్తులో చాకచక్యంగా వ్యవహరించి నిందితుడిని పట్టుకున్న పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, రూరల్ ఎస్సై మల్లేశం, ఏఎస్ఐ తిరుపతి, హెడ్ కానిస్టేబుల్ ఆనంద్, పీసీలు ప్రభాకర్, పొగుల రమేష్, అనిల్‌లను రామగుండం పోలీస్ కమిషనర్, పెద్దపల్లి డీసీపీ, ఏసీపీలు అభినందించారు. అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకోవడం ప్రజల్లో పోలీసులపై విశ్వాసాన్ని మరింత పెంచింది.



# రైతుల సమస్యలపై దాసరి మనోహర్ రెడ్డి ఆవేదన

**పెద్దపల్లి, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి రైతులు ఎదుర్కొంటున్న అవస్థలు, కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులు, మిల్లర్ల దోపిడీ, చెరువులు--గుట్టల మట్టి అక్రమ తవ్వకాలపై ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతూ, మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లో రోజులు తరబడి గడుపుతున్నారని, ఎండలో, రాత్రివేళల్లో పంటను కాపాడుకుంటూ దయనీయ పరిస్థితుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం సమీపిస్తున్నందున తడిసిన మొక్కజొన్నను కొనుగోలు చేయరని, నాణ్యత తగ్గిందని చెప్పి రైతులపైనే నష్టం మోపే ప్రమాదం ఉందని హెచ్చరించారు. సంచుల కొరత పేరుతో రైతులను అధిక ధరలకు బార్దాన్ కొనమని ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. వరి కొనుగోళ్లలో మిల్లర్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని, ప్రభుత్వం నిర్ణయించిన ప్రమాణాలకు విరుద్ధంగా సంచికి అధిక తూకం వేస్తూ రైతుల ధాన్యాన్ని దోచుకుంటున్నారని ఆరోపించారు. గ్రేడ్--1 రకాల వరికి అదనపు ధర ఇవ్వకుండా అన్నింటినీ కామన్ రకంగా చూపించి రైతులను నష్టపరిచారని మండిపడ్డారు. చెరువులు, గుట్టల మట్టిని అక్రమంగా తరలిస్తూ మట్టి మాఫియా విచ్చలవిడిగా వ్యవహరిస్తోందని, అనుమతులు లేకుండా తవ్వకాలు కొనసాగుతున్నాయని, గ్రామస్తులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు. మట్టి ఆదాయం గ్రామాలకు చేరకుండా మళ్లించడం గ్రామీణాభివృద్ధికి ఆటంకమని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ తరఫున ఆయన డిమాండ్ చేస్తూ, మొక్కజొన్న రైతులకు వెంటనే సరిపడా సంచులు సరఫరా చేసి ఆలస్యం లేకుండా కొనుగోళ్లు పూర్తి చేయాలని, వరి తూకాన్ని 40 కిలోల 650 గ్రాములకే పరిమితం చేయాలని, మిల్లర్ల తరుగు దోపిడీని అరికట్టాలని కోరారు. రాత్రివేళల్లో అక్రమంగా తిరిగే మట్టి లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, చెరువు మట్టిని రైతులకే కేటాయించాలని, మైనింగ్ ఆదాయం గ్రామాలకు చేరేలా చూడాలని జిల్లా యంత్రాంగాన్ని నిలదీశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ఉప్పు రాజకుమార్, మార్కు లక్ష్మణ్, తాన్నత్రి మోహన్ రావు, జూపల్లి సందీప్ రావు, బోయిని రాజమల్లు, సలేంద్ర రాములు, ఓదెలు, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, దయాకర్, నాంసాని సరేష్ బాబు, ముత్యాల రాజయ్య, పోసాని శ్రీనివాస్, గోపి, కాశి పాక వాసు, రేవల్లి తిరుపతి, సర్వేష్, చాంద్ పాషా, పల్లె మధు తదితరులు పాల్గొన్నారు. రైతుల సమస్యలపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి స్పష్టం చేశారు.



# మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మ ఘన సన్మానం

**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన బొమ్మ శ్రీరామ్ చక్రవర్తిని కరీంనగర్‌లో బార్ అసోసియేషన్ మరియు మారుతినగర్ వాసులు ఘనంగా సన్మానించారు. జిల్లా కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి సిహెచ్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు న్యాయవాదులు ఆయన తండ్రి బొమ్మ వెంకన్న బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా అందించిన సేవలను గుర్తుచేసి, చిన్న వయసులోనే కార్పొరేషన్ చైర్మన్ పదవి రావడం పట్ల అభినందనలు తెలిపారు. శ్రీరామ్ న్యాయవాదుల సంక్షేమానికి తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం అసోసియేషన్ కార్యవర్గం ఆయనను శాలువా, మెమెంటోతో సన్మానించింది. అదే రోజు మారుతినగర్ వాసులు కూడా శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. స్థానికులు ఆయనకు ప్రత్యేక అభినందనలు తెలియజేస్తూ ఘన స్వాగతం పలికారు. కరీంనగర్‌లో వరుసగా జరిగిన ఈ సన్మాన కార్యక్రమాలు రాజకీయ, న్యాయ వర్గాల్లో చర్చనీయాంశమయ్యాయి.






# సన్నరకం వరి సాగుపై రైతులకు అవగాహనా సదస్సు అవసరం

**- పిడిశెట్టి రాజు**

**హుస్నాబాద్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సన్నరకం వరి, పప్పుదినుసులు మరియు వాణిజ్య పంటల సాగుపై రైతులకు అవగాహనా సదస్సులు నిర్వహించాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి, కంటెస్టెడ్ ఎమ్మెల్సీ పిడిశెట్టి రాజు కోహెడ వ్యవసాయ అధికారికి వినతిపత్రం సమర్పించారు. రాజు మాట్లాడుతూ రైతులు అవగాహనా లోపం వలన తరచుగా ఒకే పంట వేసి ఆర్థికంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. వర్షాకాల ప్రారంభంలోనే సన్నరకం వరి సాగు, వాణిజ్య పంటల సాగుపై ప్రతి రైతుకు అవగాహన కల్పించే సదస్సులు నిర్వహించాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు. రైతుల ఆర్థిక స్థితి మెరుగుపడేందుకు పంటల వైవిధ్యం, అవగాహనా సదస్సులు కీలకమని పిడిశెట్టి రాజు సూచించారు.



# బస్టాండ్‌లో చైల్డ్ హెల్ప్ లైన్పై అవగాహన సదస్సు



**కరీంనగర్, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బస్టాండ్ పరిసరాల్లో చిన్న పిల్లలను ఎత్తుకొని బిక్షాటన చేస్తున్నారనే సమాచారం నేపథ్యంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 బృందం అవగాహన కార్యక్రమం నిర్వహించింది. ఈ సందర్భంగా బస్సుల్లో చైల్డ్ హెల్ప్ లైన్ 1098 స్టిక్కర్లు అతికించి ప్రయాణికులకు, డ్రైవర్లు, కండక్టర్లు, బస్టాండ్ సిబ్బంది, ఔట్‌పోస్ట్ పోలీసులకు అవగాహన కల్పించారు. జిల్లా కోఆర్డినేటర్ ఆవుల సంపత్ యాదవ్ మాట్లాడుతూ, చిన్న పిల్లలతో బిక్షాటన చేయించడం, తప్పిపోయిన పిల్లలు కనిపించడం, ఇంటి నుండి పారిపోయిన వారు లేదా ఒంటరిగా తిరుగుతున్న పిల్లలు కనిపించిన వెంటనే 1098 ఉచిత సేవా నంబర్‌కు సమాచారం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్ లైన్ సభ్యులు సుందరగిరి సాయికిరణ్ గౌడ్, ఎడ్ల ప్రియాంక తదితరులు పాల్గొన్నారు. చిన్న పిల్లలతో బిక్షాటన చేస్తే వెంటనే 1098కు ఫోన్ చేయండి అనే సందేశాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేశారు.

# బొజ్జన్నపేట ఎల్లమ్మ దేవాలయానికి బహూకరణ

**పెద్దపల్లి, మే 19 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

బొజ్జన్నపేట గ్రామంలోని శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయానికి బొల్లం అనిల్ కుమార్ తన ఉదారతను చాటుకున్నారు. సోమవారం గౌడ సంఘం అధ్యక్షుడు బానిసాని సతీష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన దేవాలయానికి ఒక ఫ్యాన్, గోడ గడియారాన్ని అందజేశారు. గ్రామస్తులు మాట్లాడుతూ, దేవాలయ అభివృద్ధికి, దైవకార్యాలకు సహాయం అందిస్తున్న అనిల్ కుమార్‌ను అభినందించారు. ఆయన మరిన్ని సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు. దేవాలయ అభివృద్ధికి గ్రామస్థుల సహకారం కొనసాగుతుండటం పట్ల ఆనందం వ్యక్తమైంది.

